టీబీ కాలువలకు నీరు

- డ్యాం నుంచి వంద క్యూసెక్కులు విడుదల
- పూజలు చేసి తూముల ఎత్తిన టీబీ బోర్డు ఇంజనీర్లు
- 18న నుంచి పంట కాల్వలకు



తుంగభద్రకు పూజలు చేస్తున్న టీబీ బోర్డు అధికారులు

కర్నూలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కి గురువారం డ్యాం సాగునీరు విడుదల చేశారు. టీబీపీ బోర్డు సెక్రెటరీ ఓ. రామకృష్ణారెడ్డి, ఎస్ఈ నారాయణ నాయక్, కర్నూలు జలవనరుల శాఖ సర్కిల్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి తుంగభద్రమ్మకు ప్రత్యేక పూజలు చేసి గేట్లు ఎత్తారు. నీరు వారం రోజుల్లో జిల్లా సరిహద్దుకు చేరే అవకాశం ఉంది. 18వ తేదీ నుంచి పంట కాలువలకు సాగు నీరు విడుదల చేయాలని ఇప్పటికే ఐఏబీ సమావేశంలో తీర్మానం చేశారు. ఓ వైపు సాగునీరు విడుదల చేయగా, మరో వైపు నీళ్లొచ్చే ముందు లైనింగ్ పనులు రాత్రింబవళ్లు చేయడంపై నాణ్యతపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్‌లో 43,519 ఎకరాలు, రబీలో 1,07,615 ఎకరాలు కలిపి 1,51,134 ఎకరాలు ఆయకట్టు ఉంది. గత ఏడాది టీబీ డ్యాం పూర్తిస్థాయి నీటిని వినియోగించుకోవడం వల్ల ఎల్లెల్సీ వాటా 24 టీఎంసీలు వాడుకున్నట్లు ఇంజనీర్లు పేర్కొన్నారు. అయితే.. గత ఏడాది 19 గేటు కొట్టుకుపోవడం వల్ల డ్యాం, గేట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన నిపుణుల కమిటీ, రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారుడు కన్నయ్య నాయుడు సూచన మేరకు ఈ ఏడాది (2025-26 నీటి సంవత్సరం) 80 టీఎంసీలు నిల్వ చేయాలని బోర్డు నిర్ణయం తీసుకుంది. 19వ గేటు సహా 32 క్రస్ట్‌గేట్లను మార్చేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. వచ్చే ఏడాది జూన్ ఆఖరి నాటికి ఏర్పాటు చేయాలని ఒప్పందం. దీంతో రబీ పంటకు సాగునీరు ఉండకపోవచ్చని అంటున్నారు. ఎల్లెల్సీ నీటివాటా 13.585 టీఎంసీలకే టీబీపీ బోర్డు వాటర్ రివ్యూ కమిటీ అంచనా వేసింది. డ్యాం నిండడం వల్ల జిల్లా ఇరిగేషన్ ఇంజనీర్లు ఇచ్చిన ఇండెంట్ మేరకు బుధవారం వంద క్యూసెక్కులు విడుదల చేశారు. నేటి నుంచి కర్ణాటక ఇండెంట్ 400 క్యూసెక్కులు, ఏపీ ఇండెంట్ 600 క్యూసెక్కులు కలిపి వెయ్యి క్యూసెక్కులు విడుదలకు బోర్డు ఇంజనీర్లు సన్నాహాలు చేస్తున్నారు. ఏపీ సరిహద్దు ఆదోని మండలం హనవాలు గ్రామం వద్ద 250.580 కిలో మీటర్లుకు చేరుకున్న తరువాత 18వ తేదీ నుంచి వివిధ డిస్ట్రిబ్యూటరీల ద్వారా పంట కాలువలకు సాగునీరు విడుదల చేసేందుకు ఎల్లెల్సీ ఇంజనీర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. తుంగభద్ర డ్యాం నుంచి ఎల్లెల్సీ, హెచ్చెల్సీ లకు సాగునీరు విడుదల చేసే కార్యక్రమంలో టీబీపీ బోర్డు సెక్రెటరీ ఓ.రామ కృష్ణారెడ్డి, ఎస్ఈ నారాయణ నాయక్, కర్నూలు జలవనరుల శాఖ సర్కి ల్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, బోర్డు ఈఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

35 వేల ఎకరాలకు సాగునీరు: ఎల్లెల్సీ ఆయకట్టు 43,519 ఎకరాలు ఉంది. డ్యాంలో 80 టీఎంసీలు నిల్వ చేయాలని నిర్ణయం తీసుకోవడం, ఎల్లెల్సీ వాటా 24టీఎంసీలకు గాను 13,585 టీఎంసీలకే కుదించడంతో ఖరీఫ్‌లో 35 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని ఇటివల జరిగిన ఐఏబీలో నిర్ణయం తీసుకున్నారు.

నీళ్లొచ్చే వేళ హడావుడిగా లైనింగ్ పనులు

టీబీపీ బోర్డు పరిధిలో ఎల్లెల్సీ లైనింగ్ పనులు దాదాపు రూ.300 కోట్లతో చేపట్టారు. బుధవారం లైనింగ్ పనులను టీబీపీ బోర్డు ఎస్ఈ నారాయన నాయక్, కర్నూలు జలవనరుల శాఖ సర్కిల్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి పరిశీలించారు. నీటి ప్రవాహానికి కాలువ అనుకూలంగా ఉందా.. లేదా..? అని కాలువ మొత్తాన్ని పరిశీలించారు. నీళ్లొచ్చే ముందు హడావుడిగా పనులు చేయడంతో నాణ్యతాప్రమాణాలపై పలు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.



తుంగభద్ర డ్యాం సైట్‌కు కాంట్రాక్ట్ సంస్థ గత నెల 20న తీసుకొచ్చిన గేట్ల విడిభాగాలు (ఫైల్)

- తుంగభద్ర డ్యాంకు ముందే వచ్చిన వరద
- గతేడాది ఆగస్టుల్లో వరదకు కొట్టుకుపోయిన 19వ గేటు
- జూన్‌లో కొత్త గేటు ఏర్పాటుకు సన్నాహాలు
- ముందస్తు వరద రావడంతో ఆగిపోయిన పనులు
- మరో ఏడాదిపాటు వేచి చూడాల్సిందే

ఈ ఏడాది లేనట్టే..!

గతేడాది ఆగస్టులో కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యాం 19వ నంబరు కొత్త గేటును ఈ ఏడాదైనా ఏర్పాటు చేస్తారా? అనే సందేహం కలుగుతోంది. టీబీపీ బోర్డు ఇంజనీర్లు స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదు. జూన్ 20వ తేదీ నాటికే క్రస్ట్ లెవల్‌పైన వరద చేరడం, ఎగువన నుంచి భారీగా వరద వచ్చి చేరుతుండడంతో.. ఏపీ జలవనరుల శాఖ సలహాదారుడు కన్నయ్యనాయుడు సైతం ఈ పరిస్థితుల్లో గేటు ఏర్పాటు రిస్క్ తీసుకోవడం సరైంది కాదని సలహా ఇచ్చారు. దీంతో ఈ ప్రక్రియను వాయిదా వేశారు. ఇప్పటికే డ్యాం గేట్ల పరిస్థితిని అధ్యయనం చేసిన కేఎస్ఎన్‌డీటీ సర్వీసెస్ సంస్థ అన్ని గేట్లు 45 శాతానికిపైగా తప్పుపట్టాయని, తక్షణమే మార్చాలని నివేదిక ఇచ్చారు. కనీసం కొట్టుకుపోయిన ఆ ఒక్క గేటునైనా ఏడాదిగా ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



కర్నూలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సంయుక్త జలాశయం తుంగభద్ర 131.29 టీఎంసీల సామర్థ్యంతో 1953లో నిర్మించారు. 212 టీఎంసీలు వినియోగించుకునేలా డిజైన్ చేశారు. కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యూనల్ (కేడబ్ల్యూడీటీ) అవార్డు-1 కేటాయింపులు ప్రకారం కర్ణాటక 138.99 టీఎంసీలు, ఉమ్మడి ఏపీ, తెలంగాణకు 73.01 టీఎంసీలు వాడుకోవాలి. డ్యాంలో పూడిక చేరడంతో సామర్థ్యం 105.788 టీఎంసీలకు తగ్గించారు. మూడు రాష్ట్రాల్లో సుమారు 12.5 లక్షల ఎకరాలకు సాగునీరు, కోటి మందికిపైగా దాహం తీర్చే జలజీవనాడి తుంగభద్ర జలాశయం. 72 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన 33 క్రస్ట్ గేట్లు 45 శాతానికి పైగా పటుత్వం కోల్పోయాయని నిపుణులు నిగ్గు తేల్చారు. గతేడాది ఆగస్టులో 19వ నంబరు గేటు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. అప్పుడు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే స్పందించి క్రస్ట్ గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌లను తుంగభద్ర డ్యాంకు పంపించారు. కర్ణాటక ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ కన్నయ్యనాయుడు బృందం రేయింబవళ్లు కష్టపడి వరదలోనే స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ ఏర్పాటు చేసి దాదాపుగా 60 టీఎంసీలు కడలిపాలు కాకుండా కపాడారు.

జూన్ ఆఖరిలోగా కొత్త గేటు ఏర్పాటు లక్ష్యం

కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ డ్యాం, గేట్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. గేట్లు సామర్థ్యం నిర్ధారణ, రేడియోగ్రఫీ, ఎంపీటీ, అల్ట్రా సోనిక్, డీపీటీలో అనుభవం, నైపుణ్యం కలిగిన కేఎస్ఎన్‌డీటీ సర్వీసెస్ సంస్థ 32 గేట్ల జీవిత కాలం, స్ట్రెంత్‌ను క్షుణంగా పరిశీలించి మొత్తం గేట్లు 40-50 శాతానికి పైగా స్ట్రెంత్ (బలం) కోల్పోయాయని, అన్ని గేట్లు మార్చాల్సిందేనని నివేదిక ఇచ్చింది. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) చైర్మన్ అనిల్ జైన్, ఏపీ జలవనరుల శాఖ సలహాదారుడు కన్నయ్యనాయుడు డ్యాంను తనిఖీ చేశారు. నిపుణుల సూచన మేరకు 19వ నంబరు గేటు ఈ ఏడాది జూన్ ఆఖరిలోగా ఏర్పాటు చేసేలా రూ.1.98 కోట్లకు టెండర్లు పిలిచారు

మిగతా 6వ పేజీలో

బడుల్లో జాతర..



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న కలెక్టర్, డీఈవో

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా చేపట్టిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనానికి అపూర్వ స్పందన కనిపించింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో జాతర వాతావరణాన్ని తలపించాయి. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారులు వారం రోజుల నుంచి శ్రమించి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, బంధువులు, పూర్వ విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొని ఆటల పోటీలు, మ్యూజికల్ చైర్స్ ముగ్గుల పోటీలతో పాటు విద్యాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. అత్యధిక మార్కులు సాధించి షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైన విద్యార్థులను సత్కరించారు. అలాగే విద్యార్థి తల్లికి ఒక మొక్కను అందజేసి పెంచే బాధ్యతను అప్పగించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులతో కలసి అందరూ సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు.

- మెగా పీటీఎం 2.0కు అపూర్వ స్పందన
- జిల్లాలో 10 లక్షల మందికి పైగా హాజరు

విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి

కలెక్టర్ రంజిత్ బాషా

వెల్దుర్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలల మధ్య బలోపేతం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను నిర్వహిస్తోందని కలెక్టర్ రంజిత్‌బాషా అన్నారు. గురువారం వెల్దుర్తి జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి ఆయనతో పాటు డీఈఓ శ్యామ్యుల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ తాను ప్రభుత్వ పాఠశాలలో చదివానని తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివి కలెక్టర్ అయ్యానని విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. అనంతరం విద్యార్థులతో కలసి ఆటల్లో పాల్గొన్నారు. మొక్కలను పంపిణీ చేశారు. షైనింగ్ అవార్డులు పొందిన లావణ్య, మేఘన, తనిష్కలను సత్కరించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు నిర్వహించిన మ్యూజికల్ చైర్స్ కబడ్డీ తదితర ఆటల్లో కలెక్టర్, డీఈఓలు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న డీఈవో శామ్యూల్ పాల్

విద్యతో భవిష్యత్తు : మంత్రి టీజీ భరత్



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

మెరుగైన విద్యతోనే ఉత్తమ భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగరం ప్రభుత్వ టౌన్ మోడల్ పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా పీటీఎం కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు వారి ఇష్టమైన విద్యలో కోర్సులను అభ్యసించే విదంగా ప్రోత్సహించాలని, వారికి ఇష్టం లేని విషయంలో బలవంతంగా వ్యవహరించరాదని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యావ్యవస్థను పటిష్టం చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారనీ, అందులో భాగంగానే మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్నారనీ తెలిపారు. ఈ సమావేశంలో ఎంఈవో ఓంకార్ యాదవ్, పాఠశాల హెచ్ఎం ప్రసాద్, కార్పొరేటర్ మౌనికారెడ్డి, ఎస్‌డబ్ల్యూవో మద్దిలేటి, తల్లిదండ్రులు, విద్యాకమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం టౌన్ మోడల్ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇదే కళాశాలలో తాను, మా సోదరి ఇంటర్మీడియట్ చదువుకున్నామని గుర్తు చేశారు. ఎంపీసీ విభాగంలో 986 మార్కులు సాధించి రాష్ట్రంలో టాపర్‌గా నిలిచిన పావని అనే విద్యార్థినితో పాటు తైక్వాండో క్రీడలో పతకాలు సాధించిన విద్యార్థులను మంత్రి టీజీ భరత్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి పాల్గొన్నారు.



పాల్గొన్న తల్లిదండ్రులు

విద్యార్థులే కూలీలు

- ఆత్మీయ సమ్మేళనంలో పిల్లలతో పనులు
- కోడుమూరు పీటీఎంలో విద్యార్థులకు పనులు



కుర్చీలు మోసుకెళ్తున్న విద్యార్థులు



కోడుమూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): భావి భారతపౌరులు కూలీలుగా మారారు. కూలీలతో చేయించాల్సిన పనులను విద్యార్థులతో చేయించారు. కుర్చీలు వేయించారు. చిట్టి చేతులతో కుర్చీలు వేయడం చూసి తల్లిదండ్రులు క్షోభకు గురయ్యారు. గురువారం కోడుమూరు పట్టణంలోని జీవీఆర్ జడ్పీ బాలుర ఉన్నతపాఠశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. పిల్లలతో కుర్చీలు మోయిస్తుంటే వాళ్ల తల్లిదండ్రులు అవమానంగా భావించి బాధను దిగమింగుకున్నారు. పేదరికంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపిస్తే చదువు చెప్పకుండా ఇలా కూలీలుగా మార్చి పనులు చేయిస్తారా? ఉపాధ్యాయులు పిల్లలతో కూడా ఇలానే చేయిస్తారని సమావేశానికి వచ్చిన కొంత మంది తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల బంగారు భవిష్యత్తు అంటే ఇదేనా అని పలువురు గుసగుసలాడుకున్నారు.

గురుపౌర్ణమి శోభ

కిటకిటలాడిన దేవాలయాలు



కర్నూలు కల్చరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. షిరిడీ సాయిబాబా, దత్తాత్రేయ దేవాలయాలు, పుట్టపర్తి సత్యసాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు, మహా మంగళహారతులు, పల్లకీ సేవ, అఖండ సాయి నామ పారాయణలు నిర్వహించారు. గురు పౌర్ణమి రోజున వ్యాస మహర్షి జన్మించిన సందర్భంగా వ్యాస భగవానుడిని, అలాగే ప్రాచీన యోగాశాస్త్రాన్ని అందించిన పతంజలి మహర్షిని గురుస్థానంలో పూజిస్తూ వీహెచ్‌పీతోపాటు పలు యోగా సంస్థల సభ్యులు తమ తమ గురువులను ఘనంగా సత్కరించారు. కర్నూలు నగరంలోని దక్షిణ షిరిడీ ఆలయానికి భక్తులు పోటెత్తారు.



ఆలయంలో భక్తుల సందడి

శాకంబరిగా భ్రామరి



6లో

నేటి సీపీఐ నేత కె.రామకృష్ణ రాక

కర్నూలు న్యూసిటీ, జూలై 10(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ 11, 12 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆలూరు నియోజకవర్గంలో 11న, పత్తికొండ నియోజకవర్గంలో 12న జరిగే మహాసభల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. భారీ ప్రజా ప్రదర్శన, బహిరంగ సభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై మహాసభల్లో చర్చిస్తారని, సభలకు పార్టీ సభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

విహారం.. విషాదం

- ట్రాక్టర్‌ను ఢీకొన్న స్కార్పియో
- నలుగురి దుర్మరణం
- ఆరుగురికి తీవ్రగాయాలు
- ప్రమాదంలో మూడు నెలల చిన్నారి మృతి
- క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలింపు

7

మృత్తిక సంగ్రహణ మహోత్సవం

● బంగారు పల్లకిలో మృత్తిక ఊరేగింపు



తులసి వనంలో మృతికకు పూజలు చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠంలో మృత్తిక(మట్టి) సంగ్రహణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏడాదికి ఒక్కసారి జరిగే మృత్తిక సంగ్రహణ మహోత్సవంలో భాగంగా తుంగభద్ర నదీ తీరంలో ఉన్న తులసి వనంలో ప్రత్యేక పూజలు చేసి మట్టిని సేకరించాక బంగారుపల్లకిలో ఉంచి ఊరేగింపుగా శ్రీమఠానికి తీసుకవచ్చారు. రాఘవేంద్రుడి మూల బృందావనం ఎదుట ఉంచి పూజలు చేశారు. ఇలా సేకరించిన మట్టిని వివిధ ప్రాంతాల్లో ఉన్న శ్రీమఠం బృందావనాలలో ఉంచి ప్రతిష్ఠాపన చేస్తారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మాట్లాడుతూ మృత్తిక శక్తి స్వరూపమని, అందులో రాఘవేంద్రస్వామి ఉంటా రని అన్నారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు సీతారామిరెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మంచాల సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ పాల్గొన్నారు.

తెలుపు రంగులో పరిమళ ప్రసాదం

నెలరోజుల పాటు టెంకాయ కొట్టడం నిషేధం



తెలుపు రంగులో తయారు చేసిన పరిమళ ప్రసాదం

మంత్రాలయం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో భక్తులకు విక్రయించే పరిమళ ప్రసాదం రంగును తెలుపులోకి మార్చారు. గత రెండు రోజుల నుంచి చాతుర్మాస వ్రతాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీరులు ఆదేశాలతో పరిమళ ప్రసాదం కాషాయ రంగు నుంచి తెలుపులోకి మార్చారు. ఈ నెల రోజులపాటు టెంకాయ కొట్టడం నిషేధమని మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచారి తెలిపారు.

20న రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్

నంద్యాల హాస్పిటల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న నంద్యాలలోని నెరవాటి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నంద్యాల జిల్లా చెస్ సంఘం రాష్ట్రస్థాయి చెస్ ర్యాంకింగ్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రామకృష్ణ డిగ్రీ కాలేజీలో గురువారం జరిగిన సమావేశంలో వారు మా ట్లాడుతూ 6, 8, 10, 12, 14, 16 సంవత్సరాల్లోపు విభాగాల్లో ఓపెన్, బాలికలకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచినవారితో జాతీయ స్థాయి చెస్ స్కూల్ టోర్నమెంట్‌లో పాల్గొనే రాష్ట్ర జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్‌లో క్రీడాకారులుగా నమోదు చేసుకున్నవారు ఈ నెల 16వ తేదీలోపు డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు.ఏపీచెస్.ఓఆర్‌జీ అనే వెబ్‌సైట్‌లో ఎంట్రీలు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం టోర్నమెంట్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా చెస్ సంఘం చైర్మన్ డా.జి.రామకృష్ణారెడ్డి, అధ్యక్షుడు డా.రవికృష్ణ, టోర్నమెంట్ చైర్మన్ హేమంత్ రెడ్డి, రాష్ట్ర చెస్ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, జిల్లా చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి రాజారమేష్ చక్రవర్తి పాల్గొన్నారు వివరాలకు 9010451585నెంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

రగ్బీలో కర్నూలు బాలుర జట్టుకు రజతం



రగ్బీ విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

కర్నూలు స్పోర్ట్స్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గత నెల 28, 29 తేదీల్లో నగర శివారులోని ఆదర్శ విద్యామందిర్ పాఠశాల మైదానంలో జరిగిన అండర్-18 బాలుర రాష్ట్ర స్థాయి రగ్బీ జూనియర్ చాంపియన్‌షిప్‌లో కర్నూలు బాలుర జట్టు రజత పతకం సాధించింది. ఈ పోటీల్లో ఆదర్శ విద్యామందిర్ పాఠశాల విద్యార్థి ఎం.భరత్ పాల్గొని జట్టు విజయానికి తమ వంతు కృషి చేశాడు. భరత్ నాలుగు సార్లు రగ్బీలో జాతీయ స్థాయిలో, 8సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడిన అనుభవం ఉంది. ఈ సందర్భంగా ఆదర్శ విద్యాసంస్థల అధినేత బి.తిమ్మయ్య, డైరెక్టర్ డా.బి.హరికిషన్, ప్రిన్సిపల్ బి.రామమాధవి, అధ్యాపక బృందం మహబూబ్ సుభాని, గురువారం భరత్‌ను అభినందించారు.

జనమే జనం

● ఏటేటా పెరుగుతున్న జనాభా
● జిల్లాలో 40.5లక్షలపైగా జనాభా
● నేడు ప్రపంచ జనాభా దినోత్సవం





ఆత్మకూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఒక దేశ ఆర్థిక ప్రణాళికలు, సామాజిక పథకాలు రూపొందించడానికి జనాభా లెక్కలు అవసరం. జనాభా లెక్కల ఆధారంగానే ప్రభుత్వ పథకాల రూపకల్పన, వెనుకబడిన ప్రాంతాల, వర్గాల అభివృద్ధి జరుగుతాయి. అందువల్ల ప్రపంచ వ్యాప్తంగా జనాభా గణాంకాల సేకరణ ప్రాముఖ్యత సంతరించుకుంది. 1987 జూలై 11వ తేదీన జన్మించిన శిశువుతో ప్రపంచ జనాభా 500కోట్ల (5 బిలియన్ల)కు చేరుకుంది. అందువల్ల ఆనాటి నుంచి ఐక్యరాజ్యసమితి జూలై 11ని ప్రపంచ జనాభా దినోత్సవంగా పాటిస్తున్నది. ప్రపంచ దేశాల్లో 40శాతం జనాభా మూడవ ప్రపంచ దేశాలైన భారత్, చైనాలోనే ఉంది. ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన నివేదికల ప్రకారం ఈదశాబ్దానికి ప్రపంచ జనాభా 800 కోట్లకు పైగా చేరుకునే అవకాశం ఉంది.

చిన్నకుటుంబం చింతలేని కుటుంబంగా వర్ధిల్లుతుంది. దంపతులకు ఇద్దరు సంతానం ఉంటే ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవించవచ్చు. ఇద్దరు పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దవచ్చు. సంతాన సంఖ్య పెరిగితే జీవన ప్రమాణాలు తగ్గుతాయి. పెద్ద కుటుంబాల్లో ఎక్కువశాతం కష్టాలు తాండవం చేస్తుంటాయి. పిల్లలకు చదువు, పౌష్టికాహారం, వారి బాగోగులను సక్రమంగా చూసేందుకు అగచాట్లు తప్పడం లేదు. తల్లిదండ్రుల్లో చైతన్యం కలిగితే జనాభా నియంత్రణ సాధ్యమవుతుంది. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను చేయించుకుని అధిక సంతానాన్ని అరికట్టవచ్చు. జిల్లాలో 40.5 లక్షలపైగా జనాభా ఉన్నది. అయితే ఇటీవల కాలంలో స్త్రీ, పురుషుల నిష్పత్తి సమానంగా లేకపోవడం, వృద్ధుల సంఖ్య పెరుగుతుండటంతో పిల్లల్ని కనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునివ్వడం గమనార్హం.

2025 ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆర్థిక అనిశ్చితి, వాతావరణ మార్పు, జనాభా పరివర్తనల మధ్య యువత తమ భవిష్యత్తును రూపొందించుకునేలా ప్రోత్సాహాన్ని ఇవ్వాలి. ఉపాధి, సమగ్ర కుటుంబ నియంత్రణ సేవలకు ప్రభుత్వాలు, సమాజం సహకారం అందించాలి.

వచ్చే 16 ఏళ్లలో దేశంలో పెరగనున్న వృద్ధుల జనాభా



రానున్న 20ఏళ్లలో దేశంలో వృద్ధుల జనాభా గణనీయంగా పెరగనున్నట్లు సర్వేలు వెల్లడి స్తున్నాయి. ఇందులో ఆశ్చర్యంలో కలిగించే విషయం ఏమిటంటే 19ఏళ్ల వయస్సులోపు జనాభా పడిపోనుంది. 2011లో 19ఏళ్ల లోపు వారు 41శాతం వుండగా 2041 నాటికి 25శాతానికి తగ్గిపోనుంది. దీనికి కారణం గర్భాధారణ సామర్థ్యం రేటు (టీఎఫ్ఆర్) తగ్గిపోవడం, మరో పక్క 60ఏళ్ల పైబడిన వారి జనాభా 2011లో 8.6శాతం ఉండగా 2041లో 16శాతానికి పెరగనుందని అంచనా. ప్రత్యేకించి తెలుగురాష్ట్రాల్లో రిప్లేస్‌మెంట్ స్థాయి కంటే టీఆర్ఎఫ్ తక్కువగా వుంది. తద్వారా వయసుమీరే వారి సంఖ్య పెరగనుంది. 2041నాటికి దేశంలో 60ఏళ్ల దాటిన వారి సంఖ్య 24కోట్లకుపైగా పెరగనుంది. 2011లో వీరి సంఖ్య 10.42కోట్ల జనాభా మాత్రమే ఉండేది.

కలుపు తీసేందుకు కాడెద్దులై..

ఎద్దుల గెలానికి రూ.2వేలు చెల్లించలేకే..



క్యాబేజీ పంటలో రైతులే కాడెద్దులై సేద్యం చేస్తున్న రైతులు

తుగ్గలి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పంటలో కలుపును తీసేందుకు రైతులు కాడెద్దులయ్యారు. గురువారం తుగ్గలికి చెందిన రైతులు ఎద్దుల గెలానికి రూ.2వేలు వెచ్చించలేక కాడెద్దులై సేద్యం చేస్తున్నారు. దంతి పట్టుకుని క్యాబేజీ, మిరప, కంది పంటల్లో కలుపు మొక్కలు తొలగిస్తున్నారు. పంటలు సాగు చేయడానికి పెట్టుబడులు పెరగడంతో సేద్యం చేసేందుకు అంత మొత్తం చెల్లించలేక అవస్థలు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎకరా పొలానికి రూ.2వేలు చెల్లించలేక

ఎకరా పొలంలో క్యాబేజీ, మిరప పంట సాగు చేశా. అందులో ఎద్దులతో గుంతక చేసేందుకు గెలానికి రూ.2వేలు. ఒక్కో కూలీకి రూ.300లు మొత్తం రూ.2,600లు చెల్లించలేక ఇద్దరు కూలీలతో కలిసి తానే కాడెద్దుగా మారి కలుపు మొక్కలను ఏరివేశాం.

● ఆకుల చంద్ర, రైతు, తుగ్గలి

భావి భారత పౌరులను తీర్చిదిద్దాలి

తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్న కలెక్టర్



భోజనం చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

వెలుగోడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రమశిక్షణ, విద్య అందించి భావిభారత పౌరులుగా ఉపాధ్యాయులు తీర్చి దిద్దాలని నంద్యాల కలెక్టర్ రాజకుమారి అన్నారు. గురువారం వెలుగోడు పట్టణంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా త్వరలో ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాలిక్‌ఖాన్, సర్పంచ్ జయపాల్, విద్యా కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా భ్రామరి

శ్రీశైలంలో ఘనంగా ఆషాఢ పౌర్ణమి



శాకంబరి అలంకరణలో అమ్మవారు, కూరగాయలతో అలంకరణ చేసిన శివలింగం

నంద్యాల టౌన్ (శ్రీశైలం), జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీశైలం భ్రమరాంబ అమ్మవారు గురువారం శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. ఉత్సవంలో అమ్మవారికి కూరగాయలు, ఆకుకూరలు, వివిధ రకాలు పూలు, పండ్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఇందుకోసం అమ్మవారికి 3వేల కిలోల కూరగాయాలు, 100 గుమ్మడి కాయలు, 2వేలు నిమ్మకాయలు, 600 ఆకు కూర కట్టలను వినియోగించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. సకాలంలో పంటలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

ఘనంగా శాకంబరి ఉత్సవం

● కామేశ్వరీదేవి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



శాకంబరి పూజల్లో పాల్గొన్న ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమిని పురస్కరించుకొని కామేశ్వరీదేవి అమ్మవారికి శాకంబరి ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి ఆలయాన్ని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. పండితుల వేదమంత్రాలతో విశేష అభిషేకాన్ని జరిపారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లతో సహస్రనామార్చన, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. వేలాదిమంది భక్తులు పాల్గొని శాకంబరి అలంకారంలో ఉన్న కామేశ్వరీదేవి అమ్మవారిని దర్శించు కున్నారు.ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివా సరెడ్డి, తహసీల్దార్ రమాదేవి, ఏఈవో యర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అలరించిన 'శ్రీ షిరిడీ సాయిలీలలు' పద్య నాటకం



షిరిడీ సాయిలీలలు నాటకంలో ఓ దృశ్యం

కర్నూలు కల్చరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి వారి సౌజన్యంతో, ఏపీ నాటక అకాడమీ సహకారంతో గురువారం రాత్రి కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రదర్శించిన 'శ్రీ షిరిడీ సాయిలీలలు' పద్య నాటకం అసాంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది. గురువారం గురు పౌర్ణమిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ నాటక ప్రదర్శన ప్రారంభోత్స వానికి ముఖ్య అతిథిగా విద్యాసంస్థల అధినేత, విద్యావేత్త డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటక రంగాన్ని పరిరక్షించుకొని కళాకారులకు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. జిల్లాకు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు గుర్రపుశాల అంకయ్య సాయిబాబా పాత్రలో నటించారు. మార్తాటి గోపాలరావు రాసిన ఈ నాటకానికి టీవీ రెడ్డి దర్శకత్వం వహించారు.

పటిష్టమైన విద్యా వ్యవస్థకు కృషి

● రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్ధనరెడ్డి

కొలిమిగుండ్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో సమూల మార్పులు తీసుకొచ్చి విద్యా వ్యవస్థను మరింత పటిష్టంగా తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి పేర్కొన్నారు. గురువారం కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో జరిగిన మెగా పీటీఎం కార్యక్రమంలో మంత్రి బీసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, సమాజంలోని ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయడమే మెగా పీటీఎం ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.28కోట్ల మంది ఈకార్యక్రమంలో పాల్గొనేలా మంత్రి నారా లోకేష్ కార్యక్రమాన్ని తలపెట్టారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం పథకం అమలు చేసి చరిత్ర సృష్టించామన్నారు. తొలిసారిగా సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనంతో పౌష్టికాహారాన్ని అందిస్తున్నామ న్నారు. గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడుతో దోచుకోవడం తప్ప పాఠశాలలకు చేసిందేమీలేదని విమర్శించారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం ఎంతో ఉన్నత లక్ష్యంతో పని చేస్తుంటే కొందరు కింది స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నారని అసంతృప్తి వ్యక్తంచేశారు. మంత్రి వస్తున్నారని తెలిసినా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కనీసం పాఠశాలలో నెలకొన్న సమస్యలను తెలియజేయాలన్న ఆలోచన లేకపోవడం బాధాకరమన్నారు. పాఠశాలలో తన సొంత నిధులతో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటుచేస్తానని మంత్రి బీసీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మూలే రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, వివేక్, హుస్సేన్‌రెడ్డి, ప్రసాదు, కామిని క్రిష్ణరంగారెడ్డి, ఓబయ్య, భూపాల్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది లేనట్టే..!

(5వ పేజీ తరువాయి)

అహ్మదాబాద్‌కు చెందిన హార్డ్‌వేర్ టూల్స్ సంస్థ టెండర్లు దక్కించుకుంది. తాత్కాలిక స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ తొలగించి కొత్త గేటు ఏర్పాటుకు టీబీపీ బోర్డు ఇంజనీర్లతో ఒప్పందం చేసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం గదగ్‌లోని వర్క్‌షాప్‌లో గేటు తయారు (ఫ్యాబ్రికేషన్) చేసి విడిభాగాలను జూన్ 20న డ్యాం సైట్‌కు చేర్చారు.

పోటెత్తిన వరద.. గేటు ఏర్పాటు వాయిదా

తుంగభద్ర డ్యాం స్పిల్‌వే క్రస్ట్ లెవల్ 1,613 అడుగులు. ఆ లెవల్‌లో నీటి నిల్వ 43 టీఎంసీలుగా ఉంటుంది. క్రస్ట్‌లెవల్ కంటే దిగువన నీటి నిల్వ ఉన్నప్పుడే గేటును ఏర్పాటు చేయాలి. గతేడాది అమర్చిన తాత్కాలిక స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్‌ను తొలగించి కొత్త గేట్ ఎరెక్షన్ (అమర్చడం) చేయాలంటే 10-15 రోజులు పడుతుంది. జూన్ 20న డ్యాం సైట్‌కు గేటు విడిభాగాలు చేర్చారు. అదే రోజు డ్యాంకు 52 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. వరద తగ్గకపోవడం, క్రస్ట్‌లెవల్ దాటి వరద చేరడం గేటు ఏర్పాటుకు అడ్డంకిగా మారింది. గత నెల 25న ఏపీ జలవనరుల శాఖ సలహాదారుడు కన్నయ్యనాయుడు ఈ సమయంలో స్టాప్‌లాగ్ ఎలిమెంట్ తొలగించి, కొత్త గేటు ఎరెక్షన్ చేయడం కష్టంతో కూడుకున్నది.. రిస్క్ తీసుకోవద్దు.. స్టాప్‌లాగ్ గేటు పటిష్టంగా ఉందని సలహా ఇవ్వడంతో గేటు ఏర్పాటును బోర్డు ఇంజనీర్లు వాయిదా వేశారు. గత 15 ఏళ్లుగా డ్యాంలో చేరే వరద రికార్డులు పరిశీలిస్తే.. ఈ సమయంలో సగటున 23.591 టీఎంసీలకు మించి వరద చేరలేదు. ప్రస్తుతం ముందస్తు వర్షాలు వల్ల మే 14న డ్యాంకు వరద మొదలై నెలాఖరుకు 15 టీఎంసీలు చేరాయి. జూన్ 20న డ్యాంలో 50,686 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉంటే.. 22కు క్రస్ట్‌లెవల్ 1,613.28 అడుగుల లెవల్ దాటి 44.460 టీఎంసీలు చేరడమే కాకుండా 25,450 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగింది. దీంతో 19వ గేట్ ఏర్పాటు మరో ఏడాది వాయిదా పడింది. జనవరిలో టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి, ఏప్రిల్ ఆఖరిలోగా గేట్ ఎరెక్షన్ చేసే అవకాశం ఉన్నా నిర్ణయాలు తీసుకోవడంలో టీబీపీ బోర్డు ఇంజనీర్లు నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమనే ఆరోపణలు లేకపోలేదు. ఏప్రిల్ 30న క్రస్ట్ లెవల్ కంటే 28.74 అడుగులకు దిగువన 1,584.26 అడుగులో నీటి నిల్వ ఉంది.



ముందస్తు వరద రావడంతో గేటు ఏర్పాటు వాయిదా

గతేడాది కొట్టుకుపోయిన 19వ నంబరు గేటు జూన్ ఆఖరిలోగా ఏర్పాటు చేయాలని కాంట్రాక్ట్ చేసుకున్న అహ్మదాబాద్‌కు చెందిన హార్డ్‌వేర్ టూల్స్ సంస్థ ఒప్పందం చేసుకుంది. గదగ్‌లోని వర్క్‌షాపులో గేట్లు ఫ్యాబ్రికేషన్ (తయారు) చేశారు. గత నెల 20న డ్యాంసైట్‌కు తీసుకొచ్చారు. ఆ సమయంలో 51 వేల క్యూసెక్కులు వరద కొనసాగుతుంది. క్రస్ట్ లెవల్ 1613 అడుగులపైన వరద చేయడం, ఇన్‌ఫ్లో భారీగా ఉండడంతో ఈ సమయంలో స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ తొలగించి, కొత్తగేట్ ఏర్పాటు చేయడం రిస్క్‌తో కూడుకున్నది. రిస్క్ వద్దని ఏపీ జలవనరుల శాఖ సలహాదారుడు కన్నయ్యనాయుడు కూడా సలహా ఇవ్వడంతో వాయిదా వేశాం. 15 ఏళ్ల వరద రికార్డులు పరిశీలిస్తే మే, జూన్‌లో ఈ స్థాయిలో వరద లేదు.

● నారాయణ నాయక్, ఎస్ఈ, తుంగభద్ర బోర్డు, హోస్పేట్

లక్ష్యంతో చదవాలి

ఈగల్ ఐజీ రవికృష్ణ



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఈగల్ ఐజీ రవికృష్ణ

దేవనకొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని ఈగల్ ఐజీ రవికృష్ణ పిలుపునిచ్చారు. కప్పట్రాళ్ల గ్రామంలో తానా భవనంలో గురువారం రవికృష్ణ రైతులు, పొదుపు సంఘాల మహిళలతో సమావేశమయ్యారు. రైతులకు సేట్రీస్ ఆధ్వర్యంలో వ్యవసాయ పరికరాలు, పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. స్థానిక జడ్పీ పాఠశాల ఆవరణలో మెగా పీటీఎం 2.0 లో రవికృష్ణతో పాటు, ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పాల్గొన్నారు. వారికి విద్యార్థులు పూల వర్షంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో చదివి ముందుకు వెళ్లాలన్నారు. కప్పట్రాళ్ల విద్యార్థులు విద్యలో రాణించి ఐఏఎస్, ఐపీఎస్‌లుగా దేశ సేవ చేసినప్పుడే గుర్తింపు సాధ్యమన్నారు. వాల్మీకి చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, సీఐ వంశీనాథ్, పాఠశాల హెచ్‌ఎం ప్రశాంతి, విశ్రాంత హెచ్‌ఎం రామరాజు, ఏవోలు ఉషారాణి, అక్బర్, మాజీ సర్పంచు దివాకర్‌నాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే నాణ్యమైన విద్య

దేవనకొండ జడ్పీ పాఠశాలలో మెగా పీటీఎం 2.0 కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆర్టీసీ చైర్‌పర్సన్ పూల నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన తల్లికి వందనంతో విద్యాశాతం పెరగాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నజీర్ అహ్మద్, ఎస్ఎంసీ వలి, టీడీపీ నాయకులు రంగన్న, ఉచ్చీరప్ప, మలకన్న, వీరేష్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



దేవనకొండ జడ్పీ పాఠశాలలో పాల్గొన్న ఎంపీ నాగరాజు, ఆర్టీసీ చైర్‌పర్సన్ పూల నాగరాజు

ఆస్తులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు

• దగ్ధమైన దుకాణాన్ని పరిశీలించిన డీఎస్పీ హేమలత



దుకాణాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

ఆదోని రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆస్తులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హేమలత హెచ్చరించారు. ఆదోని మండలం దొడ్డనగేరి గ్రామంలో బుధవారం నిప్పు పెట్టిన ఈడిగ శంకర్ దుకాణాన్ని డీఎస్పీ గురువారం రూరల్ సీఐ నల్లప్ప, పెద్దతుంబళం ఎస్.ఐ మహేష్ కుమార్‌తో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా గ్రామంలోని కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని, అల్లర్లకు పాల్పడేవారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. దుకాణానికి నిప్పు పెట్టిన కేసులో నిందితులు శ్రీరాములు, దాసప్ప, గర్జప్ప, జయరాం, నాగరాజు, మునిస్వామి, దుబ్బన్న, రవిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని ఎస్.ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విషగుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో అబ్బాస్‌నగర్‌లో రహీంఖాన్ (39) అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. బళ్లారి చౌరస్తా సమీపంలో ఓ మెకానిక్ షాపులో పనిచేస్తున్నాడు. ఏడు నెలల క్రితం అప్పుచేసి యాపిల్ ఫోన్ కొన్నాడు. ఆ అప్పు తీర్చలేక తరుచూ మదనపడేవాడు. ఈనెల 4వ తేదీన శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషగుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భార్య, బంధువులు హుటాహుటిన చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య హసీనా ఖాతూన్, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

• మరొకరికి తీవ్ర గాయాలు

కోడుమూరు రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం గ్రామ సమీపాన బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు. వివరాలు.. క్రిష్ణగిరి మండలం జి.మల్లాపురం గ్రామానికి చెందిన హేమంత్, శంకర్ బైక్‌పై పురుగుమందు కొనుగోలుకు కోడుమూరుకు వెళ్లారు. కృష్ణాపురం గ్రామం దాటాక గుండ్లకొండ వాగు వద్ద ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హేమంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హేమంత్ మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి కారాగారం

• రూ.50వేల జరిమానా

కర్నూలు లీగల్/చాగలమర్రి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి పరిధిలోని ఓ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడికి 20 సంవత్సరాల కారాగార శిక్ష, రూ.25వేలు జరిమానా విధిస్తూ కర్నూలు పోక్సో కోర్టు న్యాయాధికారి ఈ.రాజేంద్రబాబు గురువారం తీర్పు చెప్పారు. 2021 జనవరి 26న బాలిక తన తండ్రి, నిందితుడితోపాటు గ్రామ సమీపంలోని పొలానికి వెళ్లింది. మార్గమధ్యంలో ఎండ ఎక్కువైందని చెప్పి నిందితుడు బాలికను అక్కడే చెట్టుకింద ఆడిస్తానని చెప్పి ఆగిపోయాడు. బాలిక తండ్రి, మరొక వ్యక్తి వారిని అక్కడే ఉంచి పొలంలోకి వెళ్లారు. ఆ సమయంలో నిందితుడు బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాలికకు రక్తస్రావమైంది. 2021 జనవరి 28న చాగలమర్రి పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి ఆస్పత్రికి తరలించారు. అప్పటి ఆళ్లగడ్డ డీఎస్పీ రాజేంద్ర కేసును విచారించి మెడికల్ రిపోర్టులను, చార్జ్‌షీటును కోర్టులో దాఖలు చేశారు. కోర్టులో నిందితునిపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల కారాగార శిక్ష, రూ.50వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. రూ.2లక్షలను నష్టపరిహారంగా ప్రభుత్వం బాధితురాలికి చెల్లించాలని న్యాయాధికారి తన తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరపున సీపీ శ్రీనివాసులు వాదించారు.

పట్టపగలు చోరీ

ప్యాపిలి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో గురువారం పట్టపగలు చోరీ జరిగింది. ఈ ఘటనలో బంగారు నగలు, నగదు అపహరణకు గురయ్యాయి. గ్రామానికి చెందిన రామాంజినేయులు కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లారు. దీనిని గమనించిన దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాను పగలగొట్టి అందులోని 5తులాల బంగారు నగలు, రూ.30 వేల నగలు అపహరించుకొని పోయారు. పొలం పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి వచ్చిన రామాంజినేయులు కుటుంబ సభ్యులు చోరీ జరిగిందని తెలుసుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జలదుర్గం పోలీసులు తెలిపారు.

పోటాపోటీగా..



రూ.4కోట్లతో సీసీ రోడ్డు నిర్మించనున్న ప్రాంతం

• రూ.4కోట్ల సీసీ రోడ్డు నిర్మాణానికి టెండర్లు
• పాల్గొన్న నలుగురు కాంట్రాక్టర్లు

నంద్యాల హాస్పిటల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవనగర్ గేటునుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు వేయనున్న సీసీరోడ్డు నిర్మాణానికి గురువారం టెండర్ల ప్రక్రియ పోటాపోటీగా సాగింది. రూ.4కోట్లతో నిర్మించనున్న ఈ రహదారి పనులను చేజిక్కించుకునేందుకు నలుగురు కాంట్రాక్టర్లు పోటీపడినట్లు తెలుస్తోంది. నెల్లూరుకు చెందిన వీటీఆర్ బ్రదర్స్ ప్రాజెక్ట్ కంపెనీ, కర్నూలుకు చెందిన డీఎంఎస్ఎన్ కన్‌స్ట్రక్షన్స్, పి.వెంకటకృష్ణారెడ్డి, ఆళ్లగడ్డకు చెందిన పీవీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీలు పోటీపడినట్లు సమాచారం. ఈ టెండర్లు ప్రస్తుతం టెక్నికల్ టీమ్ బిడ్లను పరిశీలించిన అనంతరం సీఈకి రెఫర్ చేయనున్నట్లు తెలిసింది. మంత్రి బంధువు టెండర్ దక్కించునేందుకు పావులు కదుపుతున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అయింది. కొన్నేళ్లుగా ఈ రహదారి నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాకాలంలో మురుగునీరు రోడ్డుపై నిల్వ ఉంటూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధికి పెద్దపీట వేశారు. ఇందులో భాగంగానే రూ.4కోట్లు సీసీరోడ్డు నిర్మానికి మంజూరు చేశారు.

నాలుగు రోజుల్లో టెండర్లు ఓపెన్



నంద్యాల పట్టణంలో రూ.4కోట్లతో నిర్మించనున్న సీసీ రహదారికి సంబంధించిన టెండర్లను సీఈ ఆధ్వర్యంలో మరో నాలుగు రోజుల్లో ఓపెన్ చేయనున్నాం. సీక్రెట్ పద్దతి ద్వారా టెండర్లు స్వీకరించాం. టెక్నికల్ కమిటీ బిడ్లను ఎవాల్యుయేషన్ చేసిన అనంతరం సీఈకి ప్రతిపాదిస్తాం. సీఈ ఆధ్వర్యంలో బహిరంగంగా టెండర్లు ఓపెన్ చేస్తాం.
- శ్రీధర్‌రెడ్డి, ఈఈ, ఆర్అండ్‌బీ శాఖ, నంద్యాల

విహారం.. విషాదం

• ట్రాక్టర్‌ను ఢీకొన్న స్కార్పియో
• నలుగురి దుర్మరణం • ఆరుగురికి తీవ్ర గాయాలు
• ప్రమాదంలో మూడు నెలల చిన్నారి మృతి
• క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలింపు

అప్పటివరకు ఆ కుటుంబం ఆనందంతో గడిపింది.. ఎంతో ఉత్సాహంగా భాగ్యనగరానికి విహారయాత్రకు వెళ్లారు. అంతా సవ్యంగా ముగిసింది. ఇక తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. స్కార్పియో వాహనంలో స్వగ్రామమైన కడప జిల్లా మైదుకూరుకు బయలుదేరారు. దాదాపుగా సగానికి పైగా ప్రయాణం ముగిసింది. ఇక కొన్ని గంటల్లో గమ్యస్థానాలకు చేరుతారు అనుకున్నారు.. ఇంతలోనే విధి వక్రీకరించింది. ఉన్న ఫళంగా వారు ప్రయాణిస్తున్న వాహనం ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వేగంగా వెళ్లి ఢీకొట్టింది. వాహనం నుజ్జునుజ్జు అయింది. అందులో ప్రయాణిస్తున్న వారు చెల్లాచెదురుగా పడిపోయారు. అందులో ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు చికిత్స పొందుతూ అనంత లోకాలకు చేరారు. ఇందులో మూడు నెలల చిన్నారి కూడా మృత్యువాత పడటం ప్రతి ఒక్కరిని కంట తడిపెట్టించింది.

ఓర్వకల్లు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విహారయాత్ర ఓ కుటుంబంలో విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులు సంబరంగా విహారయాత్రకు వెళ్లి సరదాగా ముగించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా మృత్యువు వెంటాడింది. ఈ ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి.



విహారయాత్రలో కుటుంబ సభ్యులు (ఫైల్)



మూడు నెలల చిన్నారి నదియా (ఫైల్)

కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై సోమయాజులపల్లె-కాల్వబుగ్గ గ్రామాల మధ్యలో గురువారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఓర్వకల్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు. వివరాలు.. కడప జిల్లా మైదుకూరుకు చెందిన పది మంది కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు విహారయాత్ర వెళ్లారు. యాత్ర ముగించుకొని స్కార్పియో వాహనంలో బయలు దేరారు. కాల్వబుగ్గ సమీపంలో రాగానే నంద్యాల వైపు వెళ్తున్న బండల లోడు ట్రాక్టర్‌ను స్కార్పియో వాహనం వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో షేక్ పఠాన్ మున్ని (35), షేక్ కమాల్ బాషా(50) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మైదుకూరు చెందిన మాబుచాన్(50) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గాయాలైన మూడు నెలల చిన్నారి షేక్ నదియా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమార్తె మృతి చెందడంతో తల్లిదండ్రులు షేక్ ఖాదర్‌బీ, షేక్ షరీఫ్ శోకసంద్రంలో మునిగిపోయారు. తమ కళ్లముందే తమ కూతురు మృతిచెందడంతో రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. ఈ ప్రమాదంలో షేక్ షరీఫ్, స్కార్పియో డ్రైవర్ శ్రీహరికి తల వెనుక, నుదుటిపై గాయాలయ్యాయి. షేక్ మున్నాకు ఎడమ కన్ను, ముక్కుకు, షేక్ ఖాదర్‌కు ఎడమ చెవిపైన గాయాలయ్యాయి. షేక్ అబ్దుల్ ఖాదర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. షేక్ జానీకి ఎడమ వైపు, నుదుటిపైన గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొట్టడంతో స్కార్పియో వాహనం నుజ్జునుజ్జయింది. ప్రమాదం జరిగిన స్థలాన్ని కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ చంద్రబాబునాయుడు, ఎస్ఐ సునీల్ కుమార్ పరిశీలించారు. ఓర్వకల్లు పోలీసులు అక్కడికి చేరుకొని వెళ్లి వాహనాలకు అంతరాయం లేకుండా క్లియర్ చేసి క్షతగాత్రులను 108, టోల్ ప్లాజా అంబులెన్సులో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు తెలిపారు.



సంఘటనా స్థలంలో పోలీసులు

ఇష్టారాజ్యంగా..



• ఏళ్ల తరబడి ఉద్యోగుల హవా
• ఆర్‌యూలో విధులకు రాకుండానే జీతాలు
• అంతర్గత బదిలీలపై బ్లాక్‌మెయిల్.. బెదిరింపులు?
• దర్జాగా 'రియల్' దందాలు
• అవకతవకలు కట్టడి చేస్తాం: వీసీ

కర్నూలు అర్బన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ క్యాంపస్‌లో కొందరు ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రొఫెసర్లు, విద్యార్థుల మధ్య పోరుకు ఆజ్యం పోస్తున్నారు. ఏళ్ల తరబడి విధులకు హాజరుకాకుండానే నెలనెలా వేతనాలు తీసుకుంటున్నారు. దర్జాగా కాలం వెళ్లదీస్తున్నారు. మరికొందరు విద్యార్థి నాయకులను అడ్డు పెట్టుకొని రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారు.

హాల్ టికెట్లు ఇవ్వకపోవడంతో..

తాజాగా పీజీ, బీటెక్ పరీక్షలు ఈనెల 7నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్ష ప్రారంభమై రెండు రోజులు గడిచినా విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకపోవడంతో క్లర్క్‌ను సంప్రదించారు. హాల్‌టికెట్లు అవసరం లేదు.. వెళ్లండంటూ విద్యార్థులను చీదరించుకున్నాడు. పరీక్షా కేంద్రంలో ఓ హెచ్‌వోడీ విద్యార్థులకు హాల్ టికెట్లు లేకపోయినా బీటెక్ విద్యార్థులను పరీక్షలకు అనుమతించాడు. ఈ అంశాలు సర్వత్రా చర్చనీయాంశంగా ఉన్నాయి. ఉద్యోగులు విధులకు హాజరు కాకుండానే బరితెగించి మాట్లాడిన తీరుపై పలువురు విద్యార్థి నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నియంత్రణ, పర్యవేక్షణ చేపట్టాల్సిన హెచ్‌వోడిలకు సైతం వారి శాఖలపై పట్టులేక.. ఏసీ రూమ్‌ల్లో కాలక్షేపానికి మితమయ్యారనే విమర్శలున్నాయి. గాడిన పెట్టాల్సిన ఓ ఉన్నతాధికారిని చీటి కేసీ నీ బండారం బయట పెడతానని ఓ చిరుద్యోగి బ్లాక్ మెయిల్.. బెదిరింపులకు పాల్పడుతున్నారని ఓ ప్రొఫెసర్ వద్ద వాపోయే పరిస్థితి వర్సిటీ క్యాంపస్ కొట్టుమిట్టాడుతోందని విద్యార్థులు వాపోతున్నారు.

రాజకీయ నాయకుల పేర్లతో..

రాజకీయ నాయకుల పేర్లను చెప్పుకొని కొందరు ఉద్యోగులు అధికారుల ఎదుట చెలరేగిపోతున్నారు. మరో ఉద్యోగి విద్యార్థి సంఘా లన్నీ నేను చెప్పినట్లే ముందుకు అడుగులేస్తాయని ఇలా కొందరు ఉద్యోగులు స్వంత అజెండా అమలు చేసుకుంటున్నారు. క్యాంపస్‌లో బోధనేతర ఉద్యోగులు 236 మంది ఉండగా అందులో 50మందికి పైగా విధులకు హాజరుకా కుండానే నెలానెలా జీతాలు తీసుకుం టున్నారని మరి కొందరు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. విధులకు హజరయ్యే ఉద్యోగు లకు ఒక్కొక్కరి నుంచి నెలనెలా రూ.50 అసోసియేషన్ పేరుతో ఏళ్ల తరబడి కొందరు వ్యక్తులు కాజేస్తున్నారు. అలా జరగకుండా చూడాలని ఇటీవల కొందరు ఉద్యోగులు ఉపకులపతికి ఫిర్యాదు చేశారు.

అంతర్గత బదిలీలు చేస్తే చిట్టా విప్పుతా?

ఏళ్ల తరబడి ఫెవికాల్ వీరులుగా కొందరు ఉద్యోగులు కీలక స్థానాల్లో తిష్ట వేశారని కొందరు ఉద్యోగులు ఇటీవల ఉపకులపతికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఉపకులపతి అందుకు సంబంధించిన ఫైల్ సిద్ధంచేయాలని ఆదేశించినా సంబంధిత అధికారి సాహసించ లేకపోతున్నారు. ఓ కీలక ఉద్యోగి ఓ అధికారికి సంబంధించిన చిట్టా బయట పెడతానని హెచ్చరికలు జారీ చేశారనే చర్చ క్యాంపస్‌లో చక్కర్లు కొడుతోంది. రీసెర్చ్, ఎస్టాబ్లిస్ మెంట్, సీడీసీ, పరీక్షల విభాగం, ఇలా కొన్ని కీలక శాఖలో కొందరు ఉద్యోగులను ఏళ్ల తరబడి ఎలా కొనసాగిస్తారని అసోసియేషన్ నాయకులు మండిపడుతున్నారు. వారిని వెంటనే తొలగించాలని లేని పక్షంలో తాము విధులు బహిష్కరిస్తామని హెచ్చరిస్తున్నారు. దశాబ్దకాలంగా ఒకే సీటులో కొందరినే కొనసాగించడం వెనుక మాజీ ఉన్నతాధికారి తెరవెనుక ఉంటూ వారికి అండగా ఉండటం. వారి పెత్తనం క్యాంపస్‌లోని ఉన్నతాధికారులను శాసించే స్థాయికి చేరుకుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఫేస్ రీడింగ్ అమలుతో కట్టడి చేస్తాం

ఫేస్ రీడింగ్ ద్వారా ఉద్యోగుల విధుల హాజరు తీరులో అవకతవకలను కట్టడి చేస్తాం. ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడానికి సంబంధించి హెచ్‌వోడీలు పర్యవేక్షించాలి. ఆపై ఏదైనా ఉంటే చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్ల వ్యవహారంపై విచారించి చర్యలు తీసుకుంటాం. అంతర్గత బదిలీలు చేపడతాం. **- వి. వెంకట బసవరావు, ఉపకులపతి , ఆర్‌యూ**

అంగన్‌వాడీ సహాయకురాలిని తొలగించండి

• సీడీపీవోను ఆదేశించిన సబ్ కలెక్టర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆదోని రూరల్, జూలై 10 ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధిగా ఉన్న మహిళకు ప్రభుత్వ ఉద్యోగం ఎలా ఇచ్చారని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ సీడీపీవో ఉమా మహేశ్వరిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ప్రజాప్రతినిధికి అంగన్‌వాడీ పోస్టు' శీర్షికన ప్రచురితమైన కథనానికి సబ్ కలెక్టర్, జిల్లా అధికారులు స్పందించారు. మండలంలోని ఆరేకల్లుకు చెందిన వైసీపీ ఎంపీటీసీ శ్యామలమ్మ పదవికి రాజీనామా చేయకుండానే అంగన్‌వాడీ ఆయా ఉద్యోగం చేస్తుండడాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. ఈరమ్మ ఆలియాస్ శ్యామలమ్మను తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించాలని సబ్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు సీడీపీవో తెలిపారు. సదరు మహిళపై చర్యలు తీసుకోవాలని ఐ-టీడీపీ నాయకులు సజ్జాద్ హుసేన్, విరుపాక్షి, మదిరె వీరేష్, అంజినమ్మ సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు



వినతిపత్రం ఇస్తున్న ఐ-టీడీపీ నాయకులు

బంధువులే భూమిని కాజేశారు

• రీ సర్వేలో అధికారుల మద్దతుతో దాయాదుల అక్రమాలు
• మంత్రి లోకేశ్‌కు మొరపెట్టుకున్న అక్కాచెల్లెళ్లు..

ఎమ్మిగనూరు/మంత్రాలయం, జూలై 10(ఆంధ్రజ్యోతి): బంధువులే తమ భూమిని కాజేశారని ఐదుగురు అక్కాచెల్లెళ్లు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు వీడియో ద్వారా ఫిర్యాదు చేశారు. మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామానికి చెందిన ఇరిగేషన్ ఏఈ ఉసేని కుటుంబం ఎమ్మిగనూరు పట్టణంలోని మునెప్ప నగర్‌లో నివాసం ఉంటున్నది. ఏఈ ఉసేనికి షహనాజ్ బాను, షహబాన బాను, షకీలా బాను, షర్మిలా బాను, సానియా బాను అనే ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ఏఈ ఉసేని, అతని భార్య షేక్ నబీలకు సొంత గ్రామమైన మంత్రాలయం మండలం రచ్చు మర్రిలో 8.22 ఎకరాల (ఉసేనికి 519బీలో 3.66 ఎకరాలు, షేక్‌నబీకి 453ఏలో 4.66ఎకరాలు) భూమి ఉంది. ఈ భూ మిని కాజేయడానికి రీసర్వే సమయంలో ఉసేనికి ఎలాంటి సమా చారం ఇవ్వకుండా సొంత అన్న, అతని నలుగురు కుమారులు అధికారుల అండదండలతో రెండు సర్వేనంబర్లలోని 3.66 ఎకరాల భూమి రికార్డుల్లో తమ పేర్లు నమోదు చేయించు కున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఏఈ ఉసేని, అతని కుమార్తెలు అప్పటి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవటంతో సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడ న్యాయం జరగక పోవటంతో కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. పైగా ఉసేని అన్న, అతని కుమారులు ఇంటికి వెళ్లి ఫిర్యాదు చేయొద్దని బెదిరించారు. ఈ నేపథ్యంలో ఉసేని ఐదుగురు కుమార్తెలు వీడియో ద్వారా తమ గోడును మంత్రి నారా లోకేష్‌కు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పెద్దనాన్న, అతని కుమారులు తమ వారసత్వ భూమని కాజేశారని అన్నారు. మంత్రి నారా లోకేష్ ఈ సమస్యను పరిష్కరిస్తారన్న ఆశతో ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.



లోకేశ్‌కు పంపిన వీడియోలో ఆవేదనను తెలుపుతున్న అక్కాచెల్లెళ్లు

ఎస్ఈ, ఈఈలుగా అదనపు బాధ్యతలు

• ఎస్సార్బీసీ ఎస్ఈగా సుభకుమార్, టీజీపీ ఎస్ఈగా ప్రతాప్
• ఎఫ్ఆర్ఎల్ డివిజన్ ఈఈగా విజయరాజు
• హంద్రీనీవా డివిజన్-2 ఈఈగా పి. ప్రసాద్‌రావు
• పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

కర్నూలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పని చేసే ఈఈ, డీఈఈలకు ఎస్ఈ, ఈఈలుగా అదనపు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నంద్యాల ఎస్సార్బీసీ డివిజన్-3 ఈఈగా పని చేస్తున్న పి. సుభకుమార్‌కు నంద్యాల ఎస్ఆర్బీసీ సర్కిల్-1 ఎస్ఈగా, కేసీ కాలువ నంద్యాల డివిజన్ ఈఈగా పని చేస్తున్న సి.ప్రతాప్‌కు ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు నంద్యాల సర్కిల్ ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే.. కర్నూలు క్వాలిటీ సెల్ (క్యూసీ) సబ్ డివిజన్ డీఈఈగా పని చేస్తున్న బి.విజయరాజును శ్రీశైలం డ్యాం నిర్వహణ సర్కిల్ పరిధిలోని కర్నూలు పీడబ్ల్యూ డివిజన్ (ఎఫ్ఆర్ఎల్ డివిజన్) ఈఈగా, అనంతపురం జిల్లా బత్తలపల్లి టీబీపీ హెచ్చెల్సీ డీసీ సబ్ డివిజన్ డీఈఈగా పని చేస్తున్న ఎన్. ప్రసాద్‌రావును కర్నూలు హంద్రీనీవా డివిజన్-2 ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) ఇస్తూ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

• రెండు బైకులు, రూ.22,500 స్వాధీనం

బేతంచెర్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దవరం గ్రామ సమీపంలో ఉన్న పెద్దమ్మ గుడి వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ రమేష్‌బాబు తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు.

ఈ దాడుల్లో ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు మోటారు సైకిళ్లను, రూ.22,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మరో 13 మంది పరారిలో ఉన్నారని తెలిపారు. సంజామల, ఆళ్లగడ్డ ప్రాంతాలకు చెందిన 15 మంది పెద్దమ్మ గుడి వద్ద పేకాట ఆడుతుండగా.. తన సిబ్బందితో దాడులు చేశామన్నారు. అరెస్టు చేసిన ముగ్గురికి డోన్ కోర్టులో మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని తెలిపారు.

నగరాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

● పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
● నంద్యాల గేట్‌లో 'తొలి అడుగు'


ప్రజలకు కరపత్రాన్ని అందిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక కార్యాచరణలో నగరాభివృద్ధి చేస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని 13వ డివిజన్‌లోని నంద్యాల గేట్‌లో 'తొలి అడుగు'లో ఇంటింటి ప్రచారం చేశారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర ఖజానా ఖాళీ చేసినా కార్పొరేషన్ నిధులు స్థానికంగానే అభివృద్ధి వాడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. ఏడాదీ పాలనపై ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్పొరేటర్లు విజయలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: ఎమ్మెల్యే


ప్రజలకు కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. గురువారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆమె 32 వార్డు ముజఫర్‌నగర్, గంగావతినగర్‌లో ఆమె పర్యటించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఎస్వీ.రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జి పీయా మాదన్న, పాణ్యం ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ఎస్.ఫిరోజ్, 32వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి టైలర్ నాగరాజు, సోమన్న, గోల్డ్ ఇబ్రహీం, రాములమ్మ, జవ్వాజి గంగాధ ర్‌గౌడ్, కేతూరు మధు పాల్గొన్నారు.

● 28వ వార్డు పందిపాడులో కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ కూరపాటి దేవేంద్రారెడ్డి, శేఖర్‌చౌదరి ఆధ్వర్యంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కురువ భీష్ముడు, లక్ష్మణ్, నాగరాజు, రామాంజనేయులు, శివ, రవి, చందు, పవన్ పాల్గొన్నారు.

సి.బెళగల్: అర్హులైన వారందరికీ సంక్షేమ పథ కాలు అందించడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం మండలంలోని మారందొడ్డి గ్రామంలో సుపారిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. టీడీపీ మండల కన్వీనర్, చంద్రశేఖర్, సింగిల్ విండో ప్రెసిడెంట్ తిమ్మప్ప, బాలజీ, చరణ్, అమర్, బీమన్న, జిక్రియ, సోమన్న పాల్గొన్నారు.

గూడూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు జే.సురేష్ అన్నారు. గురువారం మండలంలోని బూడిదపాడు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. టీడీపీ నాయకులు బంగారు శ్రీనివా సులు, యుగంధర్, రామాంజనేయులు, రాముడు, గోపాల్‌రెడ్డి, తిరుపాల్, పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్‌ను అరికడతాం

డీఎస్పీ బాబు ప్రసాద్

కర్నూలు క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఈవ్ టీజింగ్‌ను అరికట్టేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ జే.బాబు ప్రసాద్ అన్నారు. గురువారం మూడు పోలీసు బృందాలతో కలిసి యాంటీ ఈవ్ టీజింగ్ బీట్‌లను తనిఖీ చేశారు. కృష్ణానగర్‌లోని రవీంద్ర భారతి జూనియర్ కళాశాల, కేశవరెడ్డి పాఠశాల, గుడ్ షప్పర్డ్ స్కూల్, ఇతర పాఠశాలలు, కళాశాలల పరిసర ప్రాంతాల్లో యాంటి ఈవ్‌టీజింగ్ బీట్‌లను పోలీసు అధికారులు తనిఖీలు చేశారు. ఈవ్ టీజింగ్, ఆకతాయిల వల్ల ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి రోజు జిల్లా వ్యాప్తంగా 36 ఈవ్ టీజింగ్ బీట్లు విధులు నిర్వహిస్తున్నారు. ఈవ్‌టీజింగ్ పాల్పడే వారిపై నిఘాఉంచి జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలలో విద్యాసంస్థల వద్ద ఈవ్ టీజింగ్ బీట్స్‌లో పోలీసులు 17,467 మందిని కౌన్సెలింగ్ ఇచ్చారు.

డిప్యూటీ ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

సి.బెళగల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): సి.బెళగల్ మండలానికి డిప్యూటీ ఎంపీడీవోగా మహేశ్వరి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లా డుతూ మండలంలోని గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీలు, పరిసరాల శుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామన్నారు.

'మహిళలు సాధికారత దిశగా అడుగులు వేయాలి'

కర్నూలు కల్చరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): మహిళలు సాధికారత దిశగా అడుగులు వేయాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి అన్నారు. వీహెచ్‌పీ సేవా విభాగం ఆధ్వర్యంలో, వీహెచ్‌పీ కార్యాలయంలోని భరతమాత ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో, గుణంపల్లి నారాయణమ్మ ఉచిత కంప్యూటర్ విక్షణ కేంద్రంలో శిక్షణలు పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. టీసీ మద్దిలేటి మాట్లాడుతూ గత ఆరు నెలలుగా కుట్టు, కంప్యూటర్ శిక్షణ కేంద్రాల్లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు స్వయం ఉపాధి అవకాశాల దిశగా ముందుకు పోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగ్యనగర క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మళ్ల సత్యం, వీహెచ్‌పీ నాయకులు సందడి మహేష్, ఈపూరి నాగరాజు, పీవీ గురు మూర్తి, నీలి నరసింహ, రమేష్, శేఖర్‌గుప్త, ఉపేంద్ర నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థి జీవితాన్ని మలిచేది గురువే

కర్నూలు హాస్పిటల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితాన్ని మలిచేది గురువే అని నెల్లూరు జిల్లా వినియోగదారుల కోర్టు న్యాయాధికారి జింక శేఖర్ అన్నారు. నగరంలోని టి.శేషన్ననగర్‌లో ఏపీ సాంప్రదాయ మత్స్యకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేదవ్యాస మహర్షి జయంతి వేడు కల్లో న్యాయాధికారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పదో తరగతి, ఇంటర్, నీట్‌లో మంచి ఫలితాలు, మార్కులు సాధించిన విద్యార్థులకు ఆయన ప్రశంసాపత్రాలను అందజేశారు. న్యాయాధికారి మాట్లాడుతూ చదువుకుం టేనే మంచి భవిష్యత్తు ఉంటుందని, నాలాగే జడ్జి, పోలీసు ఆఫీసర్లు, లాయర్లు, డాక్టర్లు, ఐఏఎస్, ఐపీఎస్‌లు కావచ్చునన్నారు. కార్యక్రమంలో నగర కమిటీ గౌరవాధ్యక్షుడు టి.గోవిందుస్వామి, అధ్యక్షుడు అమ్మ మెస్ శ్రీనివాసులు, కార్యదర్శి కొత్తిమీర వెంకటేశ్వర్లు, కోశాధికారి రాధాకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎద్దుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి
● అట్టహాసంగా మెగా పీటీఎం కార్యక్రమం

సి.బెళగల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యకమిటీ చైర్మన్ గోవిందు అధ్యక్షతన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. అలాగే అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ చింతలయ్య అధ్యక్షతన మెగా పీటీఎం కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు క్రీడా పోటీలు నిర్వహించి, విజేత లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్ ప్రసంగి, వైద్యాధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో రాణెమ్మ, ఎంఈవోలు జ్యోతి, ఆదాంబాషా, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఎంపీపీ బొంతల మునెప్ప, టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: విద్యాభివృద్ధికి దాతలు, పూర్వ విద్యార్థులు సహకరించాలని డ్వామా పీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ వెంక టరమణయ్య అన్నారు. గురువారం ఓర్వకల్లులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమానికి డ్వామా పీడీతోపాటు ఎంపీడీవో శ్రీనివాసులు, జడ్పీటీసీ రంగనాథగౌడు, టీడీపీ మండల కన్వీనర్ గోవింద రెడ్డి, మోడల్ స్కూల్‌లో ఎంపీపీ తిప్పన్న, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంఈ వో ఓంకార్ యాదవ్, బాలభారతి పాఠశాలలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఆయా పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల తో, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అలాగే పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో మెగా పీటీఎం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల విద్యాకమిటీ చైర్మన్లు, ప్రధానో పాధ్యా యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం గురువారం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు హాజరై ప్రసంగించారు.

● స్థానిక కేవీఆర్ జూనియర్ బాలికల కళాశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ 2.0 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి.లాలెప్ప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కర్నూలు జనసేన ఇన్‌చార్జి హర్షద్, జిల్లా వృత్తి విద్యాధికారి సురేష్‌బాబు, మాజీ ప్రిన్సిపల్ కొట్టె చెన్నయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థుల తల్దిండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. తల్లికి వందనంలో భాగంగా తల్లిదండ్రులకు వారి పిల్లలతో పాదపూజ చేయించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపి కను అందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ అధ్యక్షతన మెగా పీటీఎం 2.0 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చారు. జిల్లా వృత్తివిద్యాధికారి సురేష్‌బాబు హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, రిటైర్డు అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మీనరసయ్య, రిటైర్డు కామర్స్ లెక్చరర్ మాధవ రావు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● స్థానిక మాధవనగర్‌లోని రవీంద్ర ఇంగ్లీషు మీడియం పాఠశాల, రెవెన్యూ కాలనీలోని రవీంద్ర టాలెంట్ స్కూల్‌లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం కరస్పాండెంట్ వీటీవీ సుబ్బయ్య అధ్యక్షతన ఘనంగా జరిగింది. కార్యక్రమానికి డాక్టర్లు స్రవంతి, జి.హర్షవర్ధన్ రెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం పాఠశాల ప్రాంగణాల్లో మొక్కలు నాటారు.

కర్నూలు అగ్రికల్చర్: తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై దృష్టి ఉంచాలని, వారి కోసం కొంత సమయాన్ని కేటాయించాలని అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సరళాదేవి అన్నారు. గురువారం కల్లూరు పారిశ్రామిక వాడలోని ముజఫర్‌నగర్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ముఖ్య అతిథులుగా అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సరళాదేవి, నాలుగో పట్టణ సీఐ విక్రమసింహ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. గురువారం చిన్నటేకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జడ్పీ సీఈఓ నాసరరెడ్డి, పెద్దపాడు ప్రాథమిక పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పి.శాంతికళ, ఏ.గోకులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెట్కూరు సీఈఓ వేణుగోపాల్ హాజరయ్యారు. తల్లిదండ్రులు, టీచర్ల ఆత్మీయ సమావేశంలో పాఠశాలల అభివృద్ధి, మెరుగైన ఫలితాల కోసం తల్లిదండ్రులు, పూర్వవిద్యార్థుల సూచలను తీసుకున్నారు. ప్రభుత్వం పాఠశాల విద్యను బలోపేతం చేయాడానికి తీసుకున్న సంస్కరణలను పథకాలను వీడియోల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, టీడీపీ నాయకు లు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: విద్యార్థుల భవితవ్యం కోసమే తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల సమావేశమని హెచ్‌ఎంలు పేర్కొన్నారు. మండలంలోని గ్రామాల్లోని పాఠశాలలో గురువారం పీటీఎం వేడుకలను నిర్వహించారు. విద్యార్థుల చదువు ప్రొగ్రెస్ పై ఉపాధ్యాయులు చర్చించారు. అమడగుంట్లలో హెచ్‌ఎం అనంతయ్య ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. గోరంట్ల గురుకుల పాఠశాలలో హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీనివాస్ యాదవ్ డ్రగ్స్ వలన కలిగే అనర్థాలపై వివరించారు. పాఠశాలకు చెందిన రాకేష్ అనే విద్యార్థి ఐఐటీ సీటు సాధించడంతో ఉపాధ్యాయులు సన్మానించారు.

కర్నూలు స్పోర్ట్స్: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు కీలకమని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుడిపల్లి సురేంద్ర అన్నారు. గురువారం బీ.క్యాంపు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పీటీఎం సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పలు పోటీలు నిర్వహించారు.

గూడూరు: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కె.రామంజనేయులు అన్నారు. గురువారం గూడూరు పట్టణంలోని జడ్పీ బాలుర పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతి థిగా హాజరైన రామాంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోడుమూరు షాషావలి, టీడీపీ నాయకుడు రేమట వెంకటేశ్వర్లు, చాంద్‌బాషా, విద్యాకమిటీ చైర్మన్ కర్నా, సోలేమాన్, బాబు, నాగరాజు, భాస్కర్, పాల్గొన్నారు. అలాగే మండలంలోని అన్ని పాఠశాలలో పీటీఎం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



పెద్దపాడులో విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డీఎంహెచ్‌వో శాంతికళ, తాడు లాగుడు ఆటలో పాల్గొన్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి


కేవీఆర్ జూనియర్ బాలికల కళాశాలలో విద్యార్థినికి జ్ఞాపికను అందజేస్తున్న జనసేన నాయకుడు అర్షద్


ఓర్వకల్లు: విద్యార్థుల తల్లిదండ్రులకు బహుమతి ప్రదానం చేస్తున్న డ్వామా పీడీ వెంకటరమణ, నాయకులు

భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి

● కిటకిటలాడిన సాయిబాబా, దత్తాత్రేయ స్వామి దేవాలయాలు


యోగా గురువు దత్తయ్య దంపతులను సత్కరిస్తున్న సభ్యులు

కర్నూలు కల్చరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి వేడుకలను గురువారం జిల్లాలోని హైందవ కుటుంబాల వారు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా షిరిడీ సాయిబాబా, దత్తాత్రేయ దేవాలయాలు, పుట్టపర్తి సత్య సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు, మహా మంగళహారతులు, పల్లకీ సేవ, అఖండ సాయి నామ పారాయణలు నిర్వహించారు. గురు పౌర్ణమి రోజున వ్యాస మహర్షి జన్మించిన సందర్భంగా వ్యాస భగవానుడిని, అలాగే ప్రాచీన యోగాశాస్త్రాన్ని అందించిన పతంజలి మహర్షిని గురుస్థానంలో పూజిస్తూ వీహెచ్‌పీతోపాటూ పలు యోగా సంస్థల సభ్యులు తమ తమ గురువులను ఘనంగా సత్కరించారు.

● నగరంలో సాయినాథుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు.

నగరంలో గురుపౌర్ణమి వేడుకలు కన్నుల పండువగా సాగాయి. వేకువ జాము నుంచే సాయిబాబా దేవాలయాల వద్ద భక్తుల సందడి బాగా కనిపించింది. వందలాదిగా భక్తులు క్యూలైన్లలో నిల్చొని బాబాను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వివిధ ఆలయాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పతంజలి యోగా శిక్షణా కేంద్రంలో..: నగరంలోని వెంకటరమణ కాలనీలోని పతంజలి సాయినాథ్ యోగా శిక్షణా కేంద్రంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువు విశిష్ట బాధ్యతలను యోగా గురువు దత్తయ్య సభ్యులకు తెలియజేశారు. కార్యక్రమానికి ముందు షిరిడీ సాయి, దత్తాత్రేయ స్వాములకు పూజలు చేశారు. అనంతరం యోగా గురువు పెరుమాళ్ల దత్తయ్య దంపతులను యోగా సభ్యులు సత్కరించారు.

కర్నూలు కలెక్టరేట్: వ్యాసమహర్షి గురు పౌర్ణమి సందర్భంగా అఖిల భారత బెస్త మహాసభ ఆధ్వర్యంలో వ్యాసుని చిత్ర పటానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత బెస్త మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిటీ సాయిప్రదీప్ మాట్లాడుతూ వ్యాసమహర్షి సప్తచిరంజీవులలో ఒక్కరు అని, హిందూ సాంప్రదాయంలో గురువులకు గౌరవం ఇచ్చే గురు పౌర్ణమి రోజున వేదవ్యాసుని పుట్టినరోజుగా జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, భాస్కర్, ఉదయ్, శ్రీరాములు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని సోమయాజులపల్లె బస్‌స్టేజీ సమీపంలోని శ్రీరామ రామేశ్వర షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం గురుపౌర్ణమిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు, కాయకర్పూరాలు సమ ర్పించారు. కార్యక్రమంలో భక్తులు ఆకుల మహేష్, కాకి దేవేంద్ర, రామ మద్దిలేటి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరు మండలంలోని ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. తెల్లవారు జాము నుంచి భక్తులు సాయిబాబాకు పూజలు నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు, భజనమండలి సభ్యులు అఖండ సాయినామ భజనలో పాల్గొన్నారు.

● కల్లూరు రామిరెడ్డితాత సంస్థాన్‌లో అధ్యక్షుడు దాసరి రామచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో రామిరెడ్డితాత ఆలయంలో నిర్వహించిన గురుపౌర్ణమి వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు.

● గుత్తి పెట్రోల్‌బంక్ సమీపంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ట్రస్టీ శివరామకృష్ణ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. ఆలయ పూజారి కుమార్‌శర్మ ఉదయం తైలాభిషేకం, అర్చనలు వంటి విశేష పూజలు నిర్వహించారు.

సంగీత గురువులకు సత్కారం

కర్నూలు కల్చరల్: గురు పౌర్ణమి సందర్భంగా గురువులను సత్కరించుకోవడం గొప్ప సంప్రదాయమని హనుమాన్ కళా సమితి అధ్యక్షుడు, జిల్లా తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పి.హనుమంతరావు చౌదరి అన్నారు. గురువారం గురు పౌర్ణమి సందర్భంగా కర్నూలు మార్కెట్ యార్డులోని రైతు కళా ప్రాం గణంలో నాటకరంగ సంగీత గురువులు ప్యాలకుర్తి ఎర్రమ పాండురంగయ్య, నంది అవార్డు గ్రహీత వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ సాంస్కృతిక విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.లక్ష్మి పద్మావతి చౌదరి, రంగస్థల కళాకారులు భీసన్న, రాజశేఖర్, రాజు, భాస్కర్ యా దవ్, బాషా, కృష్ణా పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: మండలంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. పులకుర్తిలోని సాయిబాబా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తిని పల్లకిలో ఉంచి మేళతాళాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే ప్యాలకుర్తి సాయిబాబా ఆశ్రమం వద్ద భక్తులు పూజలుచేశారు. సాయిబాబా చిత్రపటాన్ని ప్రత్యేక పల్లకిలో ఉంచి ఊరేగించారు.



సాయిబాబాకు పూజలు చేస్తున్న అర్చకుడు


పాతబస్తీలోని సాయిబాబా ఆలయంలో కిక్కిరిసిన భక్తులు


సంగీత గురువులను సత్కరిస్తున్న హనుమంతరావు చౌదరి


సోమయాజులపల్లెలో షిరిడీ సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

మాజీ ఎంపీ సంజీవకుమార్‌కు సన్మానం


సంజీవకుమార్‌ను సన్మానిస్తున్న వివిధ సంఘాలు నాయకులు

కర్నూలు, జూలై 10(ఆంధ్రజ్యోతి): కర్నూలు మాజీ ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవకుమార్‌ను గురువారం టీడీపీ శ్రేణులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఆయన 17వ లోక్‌సభలో ఎంపీగా ఉన్న సమయంలో రెడ్ క్రాస్ సొసైటీకి చేసిన సేవలను గుర్తించి గోల్డ్ మెడల్ అందజేశారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా విజయ వాడలో రెడ్ క్రాస్ సొసైటీ జరిగిన ఓ కార్యక్రమంలో గోల్డ్ మెడల్, అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా ఆయన కార్యాలయంలో అభిమానులు, అనుచరులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సత్కరించారు. డాక్టర్ సంజీవకుమార్ మాట్లాడుతూ తనను ఆదరిస్తున్న ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ అవార్డు పద్మశాలీ సంఘానికి, తనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిందని పేర్కొన్నారు.

అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

కర్నూలు కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.విజయానంద్ ఆదేశించారు. స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలు, వివిధ సంక్షేమ వసతి గృహాల నిర్వహణ తదితర అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర పీ-4 కార్యక్రమంపై సీఎస్ మాట్లాడుతూ ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలోని 15 లక్షల బంగారు కుటుంబాలు (పేద కుటుంబాలను) మార్గదర్శకులు దత్తత తీసుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించామన్నారు. స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయా వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ పి.రంజిత్ బాషా, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, సీపీవో హిమప్రభాకర్‌రాజు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో బీఎల్‌వోల పాత్ర కీలకం

కల్లూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో బీఎల్‌వోల పాత్ర చాలా కీలకమని కల్లూరు తహసీల్దార్ కె.అంజనేయులు అన్నారు. గురువారం ఎలక్షన్ కమిషన్, పాణ్యం రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు బీసీ స్టడీ సర్కిల్లో మూడో రోజు బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ అంజనేయులు మాట్లాడుతూ ఎల్లవేళలా ఓటర్ల నమోదులో పారం-6,7,8 తీసుకుని క్షేత్రస్థాయిలో విచారణ చేసి అప్‌డేట్ చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు నమోదు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కొత్తగా బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులు, బీఎల్‌వోలకు రోజుకు 50 మంది చొప్పున శిక్షణ అందిస్తున్నామన్నారు. శిక్షణ తర్వాత 30 మార్కులకు అసెస్మెంట్ పరీక్ష నిర్వహిలిచి తహసీల్దారు చేతుల మీదుగా బీఎల్వోలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు విష్ణుప్రసాద్, ఎలక్షన్ డీటీ అనూరాధ పాల్గొన్నారు.

ఆదానికి దోచిపెట్టేందుకు స్మార్ట్ మీటర్లు: సీపీఎం

కర్నూలు న్యూసిటీ, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రజల సొమ్మును ఆదానికి దోచిపెట్టేందుకే స్మార్ట్ మీటర్లు తీసుకువస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు టి.రాముడు విమర్శించారు. గురువారం స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ రెవెన్యూ, పీవీ.నరసింహారావు కాలనీల్లో, ఇల్లూరు నగర్ నిరసన తెలిపారు.

వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు న్యూసిటీ, జూలై 10(ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంకు ఖాతాదారులు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ మేనేజర్ పి.నరసింహారావు అన్నారు. పెద్దమార్కెట్ సమీపంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచు అధ్వర్యంలో మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ గంగాధర్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆర్ఎం ప్రారంభించారు.

రుణం రాని గృహాలను రద్దు చేస్తాం

ఆదోని టౌన్ , జూలై 10 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాలు మంజూరు కాని టిడ్‌-కో గృహాలను రద్దు చేస్తామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. గురువారం మాట్లాడుతూ, పట్టణంలో మొత్తం 4,720 గృహాలు ఉండగా, 4,208 గృహాలను లబ్ధిదారులకు అప్పగించామన్నారు. మిగిలిన 512 గృహాలకు సంబంధించి కొందరికి రుణం మంజూరు కాలేదన్నారు. వారు 15 రోజులలోగా మున్సిపల్ కార్యాలయంలో టిడ్‌-కో అధికారులను కలిసి అర్జీ ఇవ్వాలని లేనిపక్షంలో ఇతరులకు కేటాయిస్తామన్నారు.

చిరు వ్యాపారుల కోసమే మార్కెట్


సౌకర్యాలు అడిగి తెలుసుకుంటున్న డీఎల్‌డీవో

మద్దికెర, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఉండే చిరు వ్యాపారుల కోసమే మార్కెట్ యార్డు నిర్మించినట్లు డివిజనల్ పంచాయతీ అభివృద్ధి అధికారి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం స్థానిక మెయిన్ బజారులో కూరగాయల మార్కెట్‌ను పరిశీలించారు. వ్యాపారులు మార్కెట్‌ను ఉపయోగించుకోవాలని, తడి, పొడి చెత్త వేరు చేయాలన్నారు. కార్యదర్శి శివకుమార్, ఏపీవో నర్సిరెడ్డి, పంచాయతీ సభ్యులు లక్ష్మీనారాయణ, బాలచంద్ర చంద్రశేఖర్ గౌడు, గడ్డం రామాంజులు, పారా విఠోబ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సమస్యలను పరిష్కరిస్తా : ఎమ్మెల్యే


ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న వైద్యులు

ఆదోని టౌన్ , జూలై 10 (ఆంధ్రజ్యోతి): వైద్యుల సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే పార్థసారథి హామీ ఇచ్చారు. ఐఎంఏ ఆదోని బ్రాంచ్ అధ్యక్షుడు డా. కృష్ణమూర్తి అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్న హాజరయ్యారు. వైద్యుల రిజిస్ట్రేషన్లు, రెన్యువల్ కోసం జిల్లా కేంద్రానికి వెళ్లకుండా స్థానికంగా చేసుకునేలా ఉన్నతాధికారులతో మాట్లాడుతానన్నారు. ఐఎంఏ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డా. గోపినాథ్, డా. శ్రీనివాస్, సెక్రటరీ డా. మధుసూదన్, ట్రెజరర్ డా. ఆదిత్య కుమార్. స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు, వైస్ ప్రెసిడెంట్ డా. హరీష్, మహిళా వైద్యులు, జూనియర్ వైద్యులు పాల్గొన్నారు.

రేపు సీపీఐ మహాసభలు

● హాజరుకానున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పత్తికొండ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 12న సీపీఐ నియోజకవర్గ మహాసభలు నిర్వహించనున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్ పిలుపునిచ్చారు. గురువారం సీఆర్ భవన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో కమ్యూనిస్టులకు కేంద్రమైన పత్తికొండలో ఈనెల 12న నియోజకవర్గ 14వ మహాసభలు ఉంటాయన్నారు. ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పాల్గొంటారన్నారు. కారుమంచి, రామాంజనేయులు పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకెళ్లాలి


సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు

దేవనకొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు విభేదాలు వీడి సమన్వయంతో ముందుకు వెళ్లాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి, ఎంపీ బస్తీపాటి నాగరాజు, ఆర్టీసీ చైర్మన్ పూల నాగరాజు అన్నారు. గురువారం దేవనకొండ క్రాస్ రోడ్డు దగ్గరనున్న ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మండలంలోని 12 గ్రామాల నాయకులతో సమావేశమయ్యారు. వాల్మీకి చైర్‌పర్సన్ బొజ్జమ్మ, కన్వీనర్ విజయబాస్కర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను నిలిపివేయాలి

ఆస్పరి, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లను నిలిపివేయాలని సీపీఎం మండల కార్యదర్శి బాలకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం కైరుప్పల గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. మోసపు మాటలతో బెదిరించి మీటర్లు మారుస్తున్నారన్నారు. రవి, శ్రీకాంత్, వెంకటేష్, హుసేని పాల్గొన్నారు.

బాధితుల సమస్యలు పరిష్కరించాలి


ఎస్ఐను సన్మానిస్తున్న కృష్ణమూర్తి చౌదరి

తుగ్గలి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను పరిష్కరించాలని తెలుగు యువత నాయకుడు కృష్ణమూర్తి చౌదరి, రాముడు కోరారు. బుధవారం తుగ్గలి స్టేషన్‌లో ఎస్ఐ బాల నరసింహులును సన్మానించారు. గ్రామాల్లో శాంతిభద్రతలు కాపాడాలని కోరారు.

పాఠశాలల్లో పండుగ

● సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు ● ఆదోని, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ ● హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు.. విజేతలకు బహుమతులు




వెల్దుర్తిలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఆదోని నెహ్రూ పాఠశాలలో వస్త్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, తుగ్గలిలో మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు తుగ్గలి నాగేంద్ర

వెల్దుర్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ పండుగలా సాగింది. గురువారం వెల్దుర్తిలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పీటీఎంకు కలెక్టర్, డీఈవో హాజరయ్యారు. కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బంధం బలోపేతం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను నిర్వహిస్తోందన్నారు. విద్యార్థుల కోసమే ప్రభుత్వం యూనిఫామ్, కిట్స్, వసతుల కల్పించిందన్నారు. నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పదో తరగతి విద్యార్థులంతా వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం చంద్రావతిని ఆదేశించారు. బీసీ హాస్టల్ సరిపోవడం లేదని మరో వసతి గృహాన్ని నిర్మించాలని పేరెంట్స్ కమిటీ చైర్మన్‌లు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ అనంతరం వంటగదిని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు మ్యూజికల్ చైర్స్, కబడ్డీ నిర్వహించారు. డీఈవో శామ్యూల్ పాల్, తహసీల్దార్ చంద్రశేఖరవర్మ, ఎంపీడీవో సుహాసినమ్మ, మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు, సుబ్బరాయుడు, రమాకాంత్‌రెడ్డి, జడ్పీటీసీ సుంకన్న, ఎంఈవో ఇందిర, గర్ల్స్‌హాస్టల్ వార్డెన్ గిరిజ పాల్గొన్నారు.

ఆదోని అగ్రికల్చర్: పట్టంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఫయాజుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన పీటీఎంకు ఎమ్మెల్యే పార్థసారథి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ పాఠశాలలో హెచ్‌ఎం మల్లికార్జున ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి చైర్‌పర్సన్ లోకేశ్వరి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఉందన్నారు. విద్యార్థుల తండ్రులకు టగ్ ఆఫ్ వార్ తల్లులకు లెమన్ స్పూన్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆర్ఆర్‌లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రవి ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విట్టా రమేష్, కిలిచిన్ పేట పురపాలక ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం ఉరుకుందప్ప, అందర్ పేట ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం అలిమ్ సిదిఖీ, కల్లుబావి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం గిరిబాబు పాల్గొన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ ఉరుకుంద ఉపాధ్యాయులు సునీల్ రాజ్ కుమార్, నాగరాజు రమేష్ నాయుడు, మల్లికార్జున మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులు సుధాకర్ ప్రసాద్, ఆర్ఆర్ లేబర్ కాలనీ ఉపాధ్యాయులు వీర చంద్ర యాదవ్, శ్రీరాములు, టీఎన్ఎస్ఎఫ్ రామంజి పాల్గొన్నారు.



అమ్మను గుండెల్లో పెట్టుకోవాలి

ఆదోని: అమ్మ మనకు నడక, సత్ప్రవర్తన, బాధ్యత, విలువలు, నైతికత నేర్పించిందని గుండెల్లో పెట్టుకుని చూసుకోవాలని కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప సూచించారు. గురువారం పెద్దహరివాణం జడ్పీ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ మీట్ నిర్వహించారు.డ్రగ్స్ వాడితే భవిష్యత్ సర్వనాశనం అవుతుందన్నారు. తమ ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. విద్యార్థుల కోసమే విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో సన్న బియ్యంతో భోజనం ఇస్తున్నారన్నారు. సర్పంచ్ రాము, ఆదినారాయణరెడ్డి, పేరెంట్స్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పత్తికొండ: విద్యార్థులు ఇష్టపడి చదివితే ఫలితాలు వస్తాయని ఎంఈవో రమేష్ విద్యార్థులకు సూచించారు. గురువారం పత్తికొండ బాలికోన్నతపాఠశాలలో మెగా పీటీఎం నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీదేవి ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు క్రీడలు నిర్వహించి, బహుమతులను అందించారు. జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ నయా మున్నీసా బేగం ఆధ్వర్యంలో నిర్వహించారు

తుగ్గలి: తల్లిదండ్రుల కృషితోనే విద్యార్థుల భవిష్యత్తు బంగారుమయం అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. గురువారం తుగ్గలి, జొన్నగిరి, రాంపల్లి, పెండేకల్ ఆర్ఎస్, ముక్కెల్ల తదితర గ్రామాల్లో మెగా పీటీఎం 2.0 నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు వరలక్ష్మి, విద్యాకమిటీ చైర్మన్లు మిద్దె రవికుమార్, అమీనా, ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆలూరు: మోడల్ స్కూల్‌లో ఎంఈవో చిరంజీవిరెడ్డి పాల్గొన్నారు. ఎ. ప్రిన్సిపాల్ రాఘవరావు, వైస్ ప్రిన్సిపాల్ వీరేష్, ఎస్ఎంసీ చైర్మన్ విశ్వేశ్వరస్వామి పాల్గొన్నారు.

హాలహర్వి: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఎంపీడీవో వరలక్ష్మి ఎంఈవో ఈరన్న తదితరులు పాల్గొన్నారు.


వెల్దుర్తిలో మ్యూజికల్ చైర్స్


పత్తికొండలో తల్లులకు పోటీలు



పెద్దహరివాణంలో మాట్లాడుతున్న దేవేంద్రప్ప, ఆలూరు మోడల్ స్కూల్‌లో ఎంఈవో

పేదలకు వైద్యం అందుబాటులో ఉండాలి


కరపత్రాలను అందజేస్తున్న మీనాక్షినాయుడు

ఆదోని, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పేదలకు వైద్య ఖర్చులు భారం కాకూడదని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు పేర్కొన్నారు. గురువారం ఆరేకల్లు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు మారుతినాయుడు, రామస్వామి, అప్సర్‌బాషా, మాజీ ఎంపీటీసీ రగన్న, ఫక్రుద్దీన్, రామచంద్ర, రామకృష్ణ, వెంకటేష్‌చౌదరి తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ రామాంజినేయులు

దేవనకొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితను పారదర్శకంగా తయారు ఉండాలని బీఎల్‌వోలకు ఎన్నికల ఆర్‌వో అజయ్‌కుమార్, తహసీల్దార్ రామాంజినేయలు సూచించారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీఎల్‌వోలకు ట్రైనర్ చంద్రనాయక్ శిక్షణ ఇచ్చారు. ఎన్నికల డీటీ దీపా పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెన

చిప్పగిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని ఏబీసీ కాలువపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. రెండు వైపులా ఉన్న గోడలు కూలి శిథిలావస్థకు చేరింది. ఎంపీటీసీ సభ్యురాలు ఎల్లంకి రజిని, స్పషల్ ఆఫీసర్ వెంకట రంగనాథ్ బాబు దృష్టికి తీసుకెళ్లారు. గురువారం వారు వంతెనను పరిశీలించారు. జడ్పీటీసీ సంఘం మాజీ అధ్యక్షుడు మీనాక్షి నాయుడు, పంచాయతీరాజ్ డీఈ భాస్కర్ దృష్టికి తీసుకెళ్లగా, పరిష్కరి స్తామన్నారు.


వంతెనను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

డిప్యూటీ ఎంపీడీవోగా విజయలక్ష్మి

మద్దికెర, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండల డిప్యూటీ ఎంపీడీవోగా విజయలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మద్దికెరలో పనిచేస్తున్న డిప్యూటీ ఎంపీడీవో మద్దిలేటి స్వామికి ఎంపీడీవోగా పదోన్నతి రావడంతో ఆలూరుకు బదిలీ చేశారు. ఆ స్థానంలో నందవరం డిప్యూటీ ఎంపీడీవోగా పని చేస్తున్న విజయలక్ష్మిని మద్దికెరకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని తెలిపారు. పంచాయతీల అభివృద్ధికి తన వంతుకృషి చేస్తానని తెలిపారు.

సింగిల్ విండో చైర్మన్‌గా రమాకాంత్ రెడ్డి

వెల్దుర్తి, జూలై 10 (ఆంధ్రజ్యోతి):



వ్యవసాయ సహకార సంఘం వెల్దుర్తి చైర్మన్‌గా బొమ్మన రమాకాంత్‌రెడ్డి, డైరెక్టర్లుగా బొమ్మిరెడ్డిపల్లె కోదండపాణి, రామళ్లకోట వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. ఈమేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. సొసైటీలో ప్రస్తుతం 14వేల సభ్యత్వాలు ఉన్నాయి. రమాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి బొమ్మన శివశంకర్‌రెడ్డి 25 ఏళ్ల సొసైటీ చైర్మన్‌గా సేవలందించారన్నారు. సొసైటీ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు.

బీజేపీని బలోపేతం చేస్తాం

మద్దికెర, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తామని ఆ పార్టీ నాయకుడు నాగరాజు, మాజీ కార్యదర్శి చంద్రశేఖర్ యాదవ్ అన్నారు. గురువారం బురుజుల గ్రామానికి చెందిన కున్నూరు శంకర్‌బాబును మండల బీజేపీ అధ్యక్షునిడిగా ఎంపిక చేసిన ధృవీకరణ పత్రాన్ని అందజేశారు. శ్రీనివాస్, బ్రహ్మయ్య, గోవర్ధన్ నాయుడు, శ్రీధర్‌గౌడు, మనోహర్ చౌదరి ఉన్నారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

గురుపౌర్ణమి వేడుకలు

ఆదోని అగ్రికల్చర్/టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. తెల్లవారు జాము నుంచే సాయి క్షేత్రాలు భక్తులతో కిలకిటలా డాయి. స్థానిక ఎస్‌కేడీ కాలనీ సాయిబాబా నగర్‌లోని గుడిలో, టీజీఎల్ కాలనీలోని సాయిబాబా విగ్రహాన్ని అలంకరించి భక్తు లకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అలాగే వైఎంకే నగర్ షిరిడీ సాయి ఆలయంలో అధ్యక్షుడు వీరస్వామి, కార్యదర్శి డీవీవీ ప్రసాద్, టీజీ రాంప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన

తుగ్గలి, జూలై 10 (ఆంధ్ర జ్యోతి): సీఎం చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకట్రా ముడు అన్నారు. గురువారం ఎద్దులదొడ్డి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు హంద్రీనీవా జలాలతో చెరువులను నింపేం దుకు ఎమ్మెల్యే శ్యాంబాబు కృషి చేస్తున్నా రన్నారు. మారెల్ల సొసైటీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ విజయ్ ఉన్నారు.


ఎద్దులదొడ్డిలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న నాయకులు

విత్తనాల పంపిణీ

దేవనకొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రైతులు సబ్సిడీ విత్తనాలను వినియోగించుకోవాలని ఏవో ఉషారాణి, టీడీపీ నాయకులు బడిగింజల రంగన్న, వీరేష్ సూచించారు. గురువారం వ్యవసాయ కార్యాలయంలో రైతులకు సబ్సిడీ జొన్న విత్తన ప్యాకెట్లును పంపిణి చేశారు. మండలానికి 2.4 క్వింటాళ్ల సీఎస్‌వీ-41 రకం జొన్న, ఎల్ఆర్‌జీ 52 కంది విత్తనాలు వచ్చాయనిన్నారు. ఏఈవో రంగన్న, మలకన్న ఉన్నారు.


విత్తనాల కిట్లను పంపిణీ చేస్తున్న ఏవో

కార్యకర్తలకు అండగా ఉంటా

● టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్.. ఘనంగా జన్మదిన వేడుకలు

ఆలూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా ఉంటానని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. గురువారం వీరభద్ర గైడ్ జన్మదిన వేడుకలను ఆలూరులో నిర్వహించారు. పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహించి, పార్టీ కార్యాలయం వద్ద మసాల జగన్ ఆధ్వర్యంలో గజమాల వేశారు. అనంతరం కార్యకర్తల నడుమ కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు పనిచేస్తానన్నారు. ఈ వేడుకలకు ఆరు మండలాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జి వెంకటరాముడు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గాదిలింగ, ఏబీసీ డీసీ అధ్యక్షుడు నగరడోణ కిష్టప్ప, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ రామ్‌నాథ్‌యాదవ్,కన్వీనర్ అశోక్, సర్పంచ్ నాగరాజు, గిరి మల్లేష్‌గౌడ్, రఘుప్రసాద్‌రెడ్డి, అట్టేకల్ జగన్‌మోహన్‌బాబు, శివప్రకాష్, కృష్ణంనాయుడు, అంపయ్య, సాలి సాహెబ్, నరసప్ప, ముద్దురంగ, కొమ్ము రామాంజినేయులు, రాజు గూళ్యం రామాంజనేయులు, వెంకటేష్, నీలకంఠ ఉన్నారు.



కార్యకర్తలు, నాయకులకు అభివాదం చేస్తున్న వీరభద్రగౌడ్, పార్టీ కార్యాలయంలో కేకు కట్‌చేస్తూ...

ట్రెజరీ ద్వారా ఉద్యోగులకు సేవలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● పత్తికొండ సబ్ ట్రెజరీ ఆఫీసర్ ఉమాదేవి



పత్తికొండ, జూలై 10(ఆంధ్రజ్యోతి): ట్రెజరీ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు అన్ని సేవలు అందిస్తున్నట్లు పత్తికొండ సబ్ ట్రెజరీ అధికారి ఉమాదేవి తెలిపారు.

ప్రశ్న: ఉద్యోగుల వివరాలు అప్‌డేట్ చేస్తున్నారా?

జవాబు: బదిలీ అయిన, ఇక్కడ నియాకమైన ప్రభుత్వ ఉద్యోగుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తాం.

ప్రశ్న: పత్తికొండ సబ్‌ట్రెజరీ ద్వారా ఎన్ని మండలాల ఉద్యోగులకు సేవలందిస్తున్నారు ?

జవాబు: పత్తికొండ, మద్దికెర, తుగ్గలి, దేవనకొండ మండలాల పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగుల జీవభత్యాల సేవలు పత్తికొండ కార్యాలయం ద్వారా అందిస్తున్నాం.

ప్రశ్న: ఉద్యోగుల సేవల వివరాలు ?

జవాబు: 120 విభాగాల ఉద్యోగులకు సబ్‌ట్రెజరీ ద్వారా జీతభత్యాల చెల్లిస్తున్నాం. విశ్రాంత ఉద్యోగులకు 703 మందికి పెన్షన్ పంపిణీ చేస్తాం.

ప్రశ్న: జీతభత్యాలు చెల్లింపు ఎలాఉంటుంది?

జవాబు: ఉద్యోగుల జీతాలకు సంబంధించి డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారి పంపిన వివరాల ఆదారంగా జీతాలచెల్లింపులు ఉంటాయి.

ప్రశ్న: ట్రెజరీ కార్యాలయంలో స్రాంగ్‌రూం ఉందా?

జవాబు: గతంలో పత్తికొండ స్రాంగ్‌రూం ద్వారా వస్తువుల భద్రతకు అవకాశం ఉండేది. భవనం పాతదికావడం, వర్షపునీటి నీటిలీకేజీతో ఇబ్బందులు ఉండడంతో స్రాంగ్‌రూంను రద్దుచేశారు.

ప్రశ్న: నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారా ?

జవాబు: రెవెన్యూ క్వార్టర్స్‌లో ప్రభుత్వం స్థలం కేటాయించి, భవన నిర్మాణం కూడా మొదలైంది. అయితే కొన్నికారణాలతో నిలిచిపోయింది. అధికారులకు నివేదిక పంపాం.

ఓటర్ల జాబితాలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ

మంత్రాలయం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలోని ఓటరు నమోదు, చేర్పులు, మార్పులు, తొలగింపులు, తప్పు ఒప్పులు సరి చేయడంలో నిర్లక్ష్యం వహించవద్దని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమాదేవి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జీకే గురురాజరావు ఆధ్వర్యంలో మంత్రాలయం నియోజకవర్గంలోని మంత్రాలయం, కౌతాలం, కోసిగి మండలాల్లో బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో శిక్షకుడు కన్నడ రాజు, వీరేష్, ఆర్ఐ జనార్దన్‌రావు, జయరామిరెడ్డి, వీఆర్వోలు భీమన్నగౌడు, భీముడు, భీమయ్య, శ్వేత, ఆనంద్, ప్రభాకర్, బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి



గోనెగండ్ల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కార్యదర్శి సతీష్

గోనెగండ్ల, జూలై 10(ఆంధ్ర జ్యోతి): మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలని గోనెగండ్ల మేజర్ పంచాయతీ కార్యదర్శి సతీష్ కోరారు. గురువారం ఉన్నత పాఠశాలలో వండుతున్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. దాదాపు 1500 మంది విద్యార్థులకు సరిపడ అన్నం ఏవిధంగా చేస్తున్నారని పరిశీలించారు. మెనూ ప్రకారం చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగి విరూపాక్షి ఉన్నారు.

ఇంటి గోడ విషయంలో ఘర్షణ

ఎమ్మిగనూరు రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని గుడికల్లు గ్రామంలో ఇంటి గోడ విషయంలో అన్నదమ్ముల మధ్య గురువారం ఘర్షణ జరిగింది. గ్రామాని చెందిన మాల పెద్దయ్య, మాల నవీన్ అన్న దమ్ములు అయితే ఇంటి గోడకు సెంట్రింగ్ చేసే విషయంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఒకరికొకరు కర్రలతో దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో ఇరువురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఇరువురిని అదుపులోకి తీసుకొని అన్నదమ్ములతో పాటు ఘర్షణ విషయంలో పాల్గొన్న కొండయ్య, చిన్న నల్లన్న, పెద్దయ్య, ఆనంద్‌లపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల కమిటీ ఎంపిక

ఎమ్మిగనూరు రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం పూర్వ విద్యార్థుల జనరల్ బాడీ సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శివరాముడు, వైస్ ప్రెసిడెంట్లుగా లక్ష్మీ, సత్యరెడ్డి, జనరల్ సెక్రటరీగా వినయ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వినయ్, అఖిల్, రాజ్‌కుమార్, లక్ష్మణ్, రామ్‌భరత్ ఎంపికయ్యారు. కార్యక్రమానికి పూర్వపు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు సభ్యులు కోరారు.

చెత్త నుంచి సంపదను సృష్టించాలి



కులుమాలలో ఇండ్ల నుంచి చెత్త సేకరిస్తున్న డీఎల్‌డీవో, ఎంపీడీవో

గోనెగండ్ల, జూలై 10(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపదను సృష్టించడంలో గ్రామంలోని ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని డివిజినల్ లెవెల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీఎల్‌డీవో) బాలకృష్ణారెడ్డి, ఎంపీడీవో మణిమంజరి అన్నారు. గురువారం మండల పరిధిలోని కులుమాల గ్రామంలో పంచాయతీ సిబ్బందితో కలసి ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు గ్రామాలలోని ఇంటింటి వెళ్లి తడి చెత్త, పొడి చెత్తను సేకరించాలని ఆ రెండిటిని విడిగా చేసి వర్మి కంపోస్టు ఎరువున తయారు చేసి రైతులకు అమ్మకాలు జరపాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఆహ్వానం



రాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, దుర్గా టెంపుల్ ఈవోలకు ఆహ్వానపత్రిక ఇస్తున్న శ్రీమఠం అధికారులు

మంత్రాలయం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాలకు రావాలని రాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్ర, విజయవాడ దుర్గమ్మ గుడి ఈవో వీణా నాయక్‌కు ఆహ్వాన పత్రికను మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు శ్రీపతాచార్, మేనేజర్ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, అనంతపురాణిక్‌లు ఆహ్వానించారు. గురువారం విజయవాడలో వారి కార్యాలయాలకు వెళ్లిపీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఇచ్చిన శేషవస్త్రం, పరిమళప్రసాదం ఇచ్చి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఉత్సవాలకు పాల్గొంటామనీ కమిషనర్, ఈవోలు తెలిపారు.

భూమి కోసం దాయాదుల ఘర్షణ

ఎమ్మిగనూరు టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వెంకటాపురం కాలనీకి చెందిన నాగన్న (48), దుబ్బ లక్ష్మన్న (55),పెద్ద లక్ష్మన్నలు భూమి కోసం ఘర్షణ పడ్డారు. వెంకటాపురం కాలనీలో దుబ్బ లక్ష్మన్న, పెద్ద లక్ష్మన్నలు నివాసం ఉండగా, ఆదోనిలో నివాసం ఉంటున్న కే సి నాగన్నలకు. అన్నదమ్ముల భాగాల కింద 75 సెంట్ల భూమి వచ్చింది. ఈ భూమిని పెద్ద లక్ష్మన్న కబ్జా చేసుకొని సాగు చేసుకుంటున్నాడు, ఈ విషయం తెలుసుకన్న కే సి నాగన్న, దుబ్బ లక్ష్మన్నలు వారి భాగానికి వచ్చిన భూమిని సాగు చేసుకోవడానికి ప్రయత్నించగా పెద్ద లక్ష్మన్న, అతని కుమారులు అడ్డు పడ్డారు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. కేసి నాగన్న,లభిషేక్, ఆకాష్, దుబ్బ లక్ష్మన్నకు గాయాలయ్యాయి. భాదితులు పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం



దివ్యాంగులకు ట్రై సైకిల్, వినికిడి పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, కూడా చైర్మన్

ఎమ్మిగనూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కూటమి ప్రభుత్వం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయసమావేశమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలమేరకు గురువారం పట్టణంలోని వీవర్స్ కాలనీ జడ్పీ ఉన్నతపాఠశాలలో హెచ్ఎం నాగభూషణం రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయసమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅథితులుగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఆంజనేయులు, మధుసూదన్ రాజు, సీఐ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు మహేష్, మహేంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రాలయం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో బాలబాలికలు ఉన్నతచదువులు చదివేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్నివిధాలా సహకారం అందిస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో బాగంగా మాధవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు భోజరాజు నీలకంఠస్వామి, ఎంపీటీసీ కురువ ఈరన్న, ఎస్ఐ విజయకుమార్‌లు పాల్గొని మాట్లాడారు. అదే విదంగా విద్యానగర్, తుంగభద్ర, వగరూరు, చిలకలడోన, సూగూరు, ఉన్నత పాఠశాలలో కస్తూర్బా, మోడల్ స్కూల్స్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో మెగా పీటీఎం సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాలలకు అదనపు గదులు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిధులు తెప్పిస్తామని రాఘవేంద్రరెడ్డి అన్నారు .ఈ కార్యక్రమంలో విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయులు వీరేష్, లక్ష్మయ్య, శేఖరాచార్, రామ్మోహన్, లచ్చప్ప, రాజు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● **విద్యార్థులతోనే తూతూ మంత్రంగా మెగా పీటీఎం**

మంత్రాలయం: నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలలో దాదాపు 1050 మంది విద్యార్థులు చదువుతుండగా.. గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పీటీఎం సమావేశం తల్లిదండ్రులు లేకుండానే సమావేశాన్ని తూతూ మంత్రంగా ముగించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో జరగాల్సిన సమావేశం విద్యార్థులతోనే మాట్లాడి ముగించేశారు. విద్యార్థులు తల్లిదండ్రులు దాదాపు 22 మంది హాజరు కాగా, ఇక్కడ పాల్గొన్న నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులే వేధికపై ఆసీనులు కావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. . పాఠశాల హెచ్ఎం అంపయ్య, ఎంఈవో రాగన్న ఆధ్వర్యంలో పాఠశాలల కమిటి చైర్మన్ నరసింహులు ఆధ్వర్యంలో నిర్వహించారు. జనసేన ఇన్‌చార్జి లక్ష్మన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, ఎంపీటీసీ మేకల వెంకటేశ్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో నూర్జహాన్, టీడీపీ నాయకులు వరదరాజులు, రాజు, శివ నరసింహులు, రాఘవేంద్ర మంచాల సొసైటీ డైరెక్టర్ డీసీ తిమ్మప్ప, ఉపాధ్యాయులు గోపాల్, ప్రసన్నకుమారి, పాపన్న, చంద్రశేఖర్, 20 మంది ఉపాధ్యాయులు పైగా వేదికపై ఆసీనులయ్యారు. ఏదోఒక మూలాన తల్లిదండ్రులను కూర్చుబెట్టి ఉపన్యాసాలు ఇచ్చారు. వీరికి జాతీయ స్థాయిలో పాల్గొన్న విద్యార్థులకు జనసేన ఇన్‌చార్జి లక్ష్మన్న రూ.5వేలు, డీసీ తిమ్మప్ప రూ.5వేలు, టీడీపీ నాయకులు వరదరాజులు రూ.10వేలు, అందజేశారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



సహపంక్తి భోజనంలో పాల్గొన్న రాఘవేంద్రరెడ్డి

కోసిగి: రాష్ట్ర ప్రభుత్వం మెగా పీటీఎం 2.0 కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలో నిర్వహించింది. గురువారం కోసిగిలోని ప్రభుత్వ జూనియర్ కళశాల, బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి, సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, నాడిగేని అయ్యన్న, మాజీ జడ్పీటీసీలు రామకృష్ణ, వెంకటేశ్, చిన్న తాయన్న, జ్ఞానేష్, నర్సారెడ్డి, ఈరన్న, వక్రాణి వెంకటేశ్, మాణిక్యరాజు పాల్గొన్నారు. కోసిగి కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమావేశానికి స్థలదాత అయిన పాలకుర్తి తిక్కారెడ్డి సోదరుడు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి హాజరై చదువు ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలో అధికారులు, నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పిల్లలకు చదువులు కుటుంబానికి వెలుగులు అన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీదేవి, బాలురు, బాలికల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, పరిమళదేవి, నాయకులు,పాల్గొన్నారు.

నందవరం :మండల కేంద్రమైన నందవరం హైస్కూల్‌లోగురువారం జరిగిన పీటీఎం ఆత్మీయ సమ్మెళన సభలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయిమాదవరావు మాట్లాడారు. తల్లిదండ్రులు, గురువును మించిన దైవం మరొకటి లేదన్నారు. విష్ణు, ఈశ్వర, బ్రహ్మ గురించి విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. తహసీల్దారు శ్రీనివాసులు, కాశీంవలి, సుదీర్, బీమశేఖర్ పాల్గొన్నారు. కస్కూర్బా స్కూల్‌లో ఎంపీడీవో ఫుల్లయ్య, ఎస్ఐ కేశవ, ముగతిలో ఈరన్నగౌడు, బార్గవ్‌యాదవ్, నాగలదిన్నెలో టీ ఈరన్న, సలీం, వహబ్, సోమలగూడురులో వెంకట్రామిరెడ్డి, చంద్ర, మాచాపురంలో క్లస్టర్ కాశీంవలీ, కిషోర్, సత్యారెడ్డి, మాబు ఉసేని, వలి, హలహర్విలో రైస్‌మిల్ నారాయణరెడ్డి, కనకవీడులో డబ్బా ఈరన్న ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



నందవరంలో మాట్లాడుతుప్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు

పెద్దకడుబూరు: మండలంలో ఉన్న 52 పాఠశాలలో పండుగ వాతవరణంలా పేరంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగానే పాఠశాలలను మామిడి తోరనాలతో, రంగు రంగుల బెలూన్లతో, రంగువల్లుతో తీర్చిదిద్దారు. మండల కేంద్రమైన పెద్దకడబూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి హజరయ్యారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి నాగరాజు రావు, యంఈవోలు సువర్ణల సునియం, రాంమూర్కి, ఎంపడీవో పభావతి, హనుమాపురం ఎంపీటీసీ శశిరేఖ, తాహసీల్దార్ గీతాప్రయదర్శిని, వైసీపీ నాయకులు రాంమోహన్‌రెడ్డి, విజేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల ఆత్మీయసమావేశం ఘనగా నిర్వహించారు. మైనార్టీ కాలనీలో ఉన్న కేజీబీవి విద్యాలయంలో తహశీల్దార్ శేషఫణి పాల్గొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు నేర్పే క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల పర్యవేక్షణ ఉండాలన్నారు. అలాగే మచాని సోమప్ప ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో రిటైర్డ్ హెచ్ఎం పాల్గొని ప్రసంగించారు. జడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వం ఉన్నత పాఠశాల, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ఎస్ఎస్ఎస్, సోమప్ప నగర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఆత్మీయసమావేశాలు నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలకు రావటం పాఠశాలల్లో పండుగ వాతావరణం ఏర్పడింది. కార్యక్రమంలో హెచ్ఎంలు కృష్ణమూర్తి, శారద, ఏఓ కృష్ణయ్య, కౌన్సిలర్ ఉప్పర పద్మ, నరసింహులు, నటరాజ్, విద్యార్థుల తల్లిదండ్రులు విజయ, పాల్గొన్నారు.

గోనెగండ్ల:విద్యార్థులలో నైపుణ్యత, సృజనాత్మకత పెంచేందుకు వారి భవిష్యత్ కు బంగారు బాట వేసేందుకు గాను సీఎం చంద్రబాబానాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ పెరెంట్స్, టీచర్ల సమావేశం ఏర్పాటు చేశారని రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ తెలిపారు. మండల కేంద్రమైన గోనెగండ్లలోని ఉన్నత పాఠశాల యందు మెగా పెరెంట్స్ సమావేశం నిర్వహించారు. డీఎల్‌డీవో బాలకృష్ణారెడ్డి, ఎంపీడీవో మణిమంజరి, డాక్టర్ రంగారవళి, సర్పంచ్ హైమావతి, సతీశ్, ఉపాధ్యాయులు ప్రసంగించారు.



పెద్దకడబూరులోమాట్లాడుతున్న టీడీపీ అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి



గోనెగండ్ల మాట్లాడుతున్న రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్

ఆక్వా సాగులో రైతులకు అధిక లాభాలు

కోసిగి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని తుమ్మిగనూరు గ్రామంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, మత్స్యశాఖ డీడీ రంగనాథ్ హాజరయ్యారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఆక్వా సాగులో దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని, మంచినీరు వనరులు వాడుకుని సారవంతం కాని నేలలో చేపల చెరువుల సాగు ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షోభంలో ఉన్న ఆక్వారంగాన్ని ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఆక్వా సాగు చేస్తున్న రైతులను ప్రోత్సహించేందుకు వారికి సబ్సిడీ కింద విద్యుత్ చార్జీలు తగ్గిస్తూ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఫిషనరీ డీఈ నాగరాజు, రవికుమార్, ఎస్ఐ హనుమంతరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, మాజీ సాగునీటి సంఘం అద్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి, ఆర్లబండ సింగిల్ విండో చైర్మన్ నాడిగేని అయ్యన్న, జ్ఞానేష్, తుమ్మిగనూరు గోపాల్, మత్స్యశాఖ రైతులు, వెంకటేశ్, భీమయ్య, హనుమేష్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ వయస్సు తగ్గించాలి: కరుణాకర్

నందవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): డప్పు కళాకారులకు పింఛన్ వయస్సు తగ్గించాలని డప్పుకళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి కరుణాకర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రమైన నందవరంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు దర్నా నిర్వహించారు.

విశేష పంచామృతాభిషేకం

మంత్రాలయం, జూలై 10(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేందస్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణతో పాటు విశేష పుష్పాంకరణ, మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం చేశారు

పీఠాధిపతికి తులాబారం, పుష్పాలతో అభిషేకం: వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తీర్థులకు బెంగళూరుకు చెందిన బాలాజీ, వీణ లు బెల్లంతో తులాబారం చేశారు. అదేవిధంగా శిరుగుప్పకు చెందిన హనుమంతయ్య బృందం పీఠాధిపతికి పుష్పాలతో అభిషేకం చేశారు

శ్రీమఠానికి రెండు బ్యాటరీ వాహనాలు విరాళం

రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరు చెందిన గోకుల ఎంఎస్ రామయ్య ఫౌండేషన్ ఇన్స్‌ట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టూడియోస్ వారు దాదాపు రూ.15 లక్షలు విలువ చేసే రెండు బ్యాటరీ వాహనాలు విరాళంగా ఇచ్చారు. విరాళం ఇచ్చిన దాతలకు పీఠాధిపతి మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమల ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

సమస్యల పరిష్కారం కోసం పోరాటం

గోనెగండ్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం సీఐటీయూ పోరాటం చేస్తుందని సీఐటీయూ జిల్లా నాయకులు ఆనందబాబు, అన్నారు. గోనెగండ్లలో సీఐటీయూ నాయకుల సమావేశం నిర్వహించారు.అనంతరం గోనెగండ్ల మండల సీఐటీయూ కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆంధ్రజ్యోతి కథనం.. చిన్నారి భవిష్యత్తుకు వెలుగు



చిన్నారికి ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు

కోసిగి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాయాల్సిన సన్నకి చిన్నారి అనే విద్యార్థిని తన తల్లిదండ్రులతో పాటు గుంటూరు వలస వెళ్లి మిర్చి పొలంలో పని చేస్తూ పదో తరగతి పరీక్షలు రెండు రాయలేదు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో పరీక్షలు రాయాల్సిన విద్యార్థిని మిర్చి పొలంలో అనే కథనానికి మిగిలిన నాలుగు పరీక్షలు రాసి చిన్నారి ఆ పరీక్షల్లో పాస్ కావడంతో పాటు సప్లిమెంటరీలో కూడా మిగిలిన రెండుపరీక్షలు మంచి మార్కులతో పాస్ కావడంతో ఆంధ్రజ్యోతి కథనం విద్యార్థికి వెలుగునిచ్చిందని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధా ్యయురాలు జి.పరిమళాదేవి అన్నారు. ఆత్మీయ సమావేశంలో బాలికల ఉన్నత పాఠశాలలో చిన్నారికి సీఐ మంజునాథ్, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి, ఎస్ఐ హనుమంతరెడ్డి, నాయకులు అభినందించి మాణిక్యరాజు రూ.2,500లు విద్యార్థిని చిన్నారికి ఆర్థిక సాయం అందించారు.

ఘనంగా గురుపౌర్ణమి

- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు
- పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, ప్రముఖులు
- ప్రశాంతంగా వేడుకలు



ఎమ్మార్వో కార్యాలయంలోని సాయినాథుడుని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బీవీ .జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్/ఎమ్మిగనూరు రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మిగనూరు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా పట్టణంలోని వీవర్స్ కాలనీలోని సాయిబాబా, ఎమ్మార్వో కార్యాలయంలోని దత్త సాయి, సాయి నగర్‌లోని వెంకట సాయిబాబా, టిబిపి కాలనీలోని సాయిబాబా, సోమప్ప నగర్‌లోని సాయిబాబా, మంత్రాలయం రోడ్డు నందు సాయిబాబా దేవాలయలల్లో వేలసిన బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఎమ్మార్వో కార్యాలయంలోని సాయిబాబాను ఎమ్మెల్యే బి వి జయనాగేశ్వరరెడ్డి దర్శించుకొన్నారు.ధర్మకర్త, ప్రముఖ న్యాయవాది కడిమెట్ల లక్ష్మీనారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ యార్డు చైర్మెన్ మల్లయ్య, పట్టణ అధ్యక్షులు కామార్తి మహేష్, మహేంద్ర, బచ్చాల రంగన్న, కటారి రాజేంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం గురుపౌర్ణమి వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన గోనెగండ్లలో వీర శైవ మఠం పీఠాధిపతి శివయ్య స్వామి ఆధ్వర్యంలో పాత ఈశ్వరదేవాలయం నుంచి తుంగభద్ర కాలు దగ్గర ఉన్న శివాలయం వరకు సాయిబాబా చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగించారు కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షులు రవిప్రకాష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కృష్ణవేణి, ఉరుకుందరెడ్డి, రవి, శ్రీనివాసులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



గోనెగండ్లలో సాయి పల్లకిని ఊరేగిస్తున్న వీరశైవమఠం పీఠాధిపతి శివయ్యస్వామి

కోసిగి:మండల కేంద్రమైన కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో షిరిడీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్దలతో సాయి రుత్విక్, గట్టు రమేష్, సాయి సేవక్ మునీంద్ర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయిబాబాకు భక్తులు ఆలయంలో పూజలు, కాగడ హారతులు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై సాయిబాబాను దర్శించుకున్నారు. భక్తులకు ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



పూజలందుకుంటున్న షిరిడీ సాయిబాబా



ఎమ్మిగనూరు సాయిబాబా ఆలయంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

పెద్దకడుబూరు : మండల కేంద్రమైన పెద్దకడుబూరులో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. బోధగురువులైన అచలవీరం గురువులు చిన్న రంగన్నస్వామికి సన్మానం చేశారు. అనంతరం జెండావిష్కరణ చేసి మొక్కలు నాటారు. శిష్యులకు గీతోపదేశం చేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, ఆంజనేయ, రామగోవిందప్ప, నరసింహులు, శీను, ఈరన్నలు పాల్గొన్నారు.



పెద్దకడబూరులో కాషాయ జెండాను ఆవిష్కరిస్తున్న భక్తులు